మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline
NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 5.5.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 14 + 4 + 32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 14 + 4 + 32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 13 ‖ సంచిక (Issue): 331 ‖ వెల (Price) రూ.8.00

ఆదివారం, సూర్యోదయం: 5-48, సూర్యాస్తమయం: 6-38. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వసంత రుతువు చైత్ర మాసం కృష్ణ పక్షం తిథి: ద్వాదశి సాయంత్రం 5-42 వరకు. నక్షత్రం: ఉత్తరాభాద్ర రాత్రి 7-57 వరకు. వర్జ్యం: ఉదయం 6-52 నుంచి ఉదయం 8-19 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-59 నుంచి సాయంత్రం 6-35 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-53 నుంచి సాయంత్రం 5-44 వరకు. అమృతకాలం: పగలు 3-34 నుంచి సాయంత్రం 5-01 వరకు.





జిల్లాల రద్దుపై యుద్ధం చేద్దాం

మంచిర్యాల జిల్లాను రద్దు చేస్తమంటున్నరు.. కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తడట ముఖ్యమంత్రి

సీఎం ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడిపై ఒట్టు.. పంటకు బోనస్ లేదు.. మద్దతు ధరకు కొనే దిక్కులేదు

దళితబంధు డబ్బులు వాపస్ తీసుకున్నరు.. కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్లు, రంజాన్ తోఫాలు ఇస్తలేరు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రెప్పపాటు కూడా పోకుండా వచ్చిన కరెంటులో ఇప్పుడెందుకు కోతలు పడుతున్నయి? నల్లా నీళ్లు ఎందుకు మాయమైపోయినయి? సీఎం రిలీఫ్ ఫండ్ ఎక్కడపోయింది? కల్యాణలక్ష్మి చెక్కులు ఎక్కడికి పోయినయ్. ఎందుకు మాయమైనయ్? రైతుబంధు ఎటు పోయింది? రైతుబంధు కోసం పెట్టిన నిధులు ఎటు పోయినయ్? ఐదు నెలల ముందు తెలంగాణ ఎట్లా ఉండె? ఈ ఐదు నెలల్లో ఇంత ఆగం ఎందుకైంది? - కేసీఆర్ › 2

- ఆటోరిక్షా కార్మికుల బతుకులు ఆగమైపోయాయి
- అరచేతిలో వైకుంఠం చూపి ప్రజలను మోసం చేసిండ్రు
- ప్రజలకు ఉపయోగపడే అన్ని పనులు నిలిపేస్తున్నరు
- నరేంద్రమోదీ గోదావరిని ఎత్తుకపోతానంటున్నడు
- బీజేపీకి ఓటు వేసినా, అది గోదాట్ల పడేసినా ఒకటే
- తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వం కాపాడాలన్నా.. సింగరేణి ప్రైవేటు కావద్దన్నా ఈశ్వర్‌ను గెలిపించాలి
- ఆగర్భ శ్రీమంతుడికి, భూగర్భ కార్మికుడికి మధ్య పోటీ
- మంచిర్యాల రోడ్‌షోలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

రైతుకు రేవంత్ మరో వాయిదా!

కేసీఆర్‌కు జడిసి రైతుబంధుపై ప్రకటన

బుధవారం లోపు ప్రతి రైతుకూ ఇస్తా

9న ఒక్కరికి బకాయి ఉన్నా అమరుల స్థూపం ముందు ముక్కు నేలకు రాస్తా

రైతులకు క్షమాపణ చెప్తా: సీఎం రేవంత్



- **సాయం మిగిలింది మరో 4 లక్షల మందికే**
- **కొత్తగూడెం సభలో సీఎం రేవంత్ ప్రకటన**
- **ఎక్కడికెళ్లినా రైతుబంధుపై కేసీఆర్‌కు మొర**
- **ఎక్కడికక్కడ సర్కారును నిలదీసిన బీఆర్ఎస్**
- **దిగొచ్చిన సీఎం.. రైతుబంధుపై ప్రకటన**
- **కేసీఆర్ ప్రశ్నల వర్షంతో రేవంత్‌లో ఫ్రస్ట్రేషన్**
- **కేసీఆర్‌పై షరా మామూలుగానే తిట్ల దండకం**
- **ఇప్పటికే నాలుగు సార్లు మారిన తేదీలు**
- **ఈ తేదీకైనా సర్కారు మాట నిలబడేనా?**

హైదరాబాద్, మే 4(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి దిగొచ్చారు. పంటలు కోతకొస్తున్నా రైతుబంధు పైసలు రాకపోవటంపై కేసీఆర్ తన ప్రతి సభలోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. 'మీకు రైతుబంధు పడిందా?' అంటూ కేసీఆర్ అడిగే ప్రశ్నకు పడలేదంటూ రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి › 6వ పేజీలో

ఇస్తున్నది రైతుబంధే.. రైతు భరోసా కాదు

కాదని నిరూపిస్తే రాజీనామా చేస్తా

- **రేవంత్‌కు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్**
- **రైతు భరోసా అంటే రూ.15 వేలు ఇవ్వాలి**
- **సర్కారు ఇస్తున్నది పదివేలే.. అదీ కొందరికే**



సూర్యాపేట, మే 4 : కాంగ్రెస్ సర్కార్ రైతు భరోసా ఇచ్చినట్టు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ప్రకటించారు. బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ శనివారం రాత్రి సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రైతు భరోసాపై చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఐదు నెలలుగా సతాయించడమేగాక ఇప్పుడు 65 లక్షల మందికి రైతు భరోసా ఇచ్చాను.. వంద శాతం ఇస్తానని అబద్ధాలు చెప్పేందుకు సిగ్గు ఉండాలని అన్నారు. ఐదు నెలలు ఆలస్యం › 6వ పేజీలో

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

నీళ్లు లేక ఎండిన పంటలు.. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపం

పురుగు మందు తాగి బలవన్మరణం

హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో విషాదం › 11

జిల్లాలు కదిలిస్తే కల్లోలమే

కార్యాలయాల్లో ఉద్యోగ వ్యవస్థ అస్తవ్యస్తం

ఉద్యోగుల పంపకాల ప్రక్రియ మళ్లీ మొదటికి

ఒకటి, రెండేండ్ల వరకూ నోటిఫికేషన్లు బంద్

రాష్ట్రవ్యాప్తంగా పడిపోనున్న భూముల ధరలు

ప్రైవేటు పెట్టుబడులు వెనక్కి.. మళ్లీ వలసలు

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను కుదిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. కనీసం 15 జిల్లాలను రద్దు చేస్తారన్న ప్రచారంతో ఆయా జిల్లాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివిధ రంగాల విశ్లేషకులు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇదే జరిగితే రాష్ట్రం ఆగమవుతుందని హెచ్చరిస్తున్నారు. జిల్లాల సంఖ్య కుదింపుతో సామాజికంగా, ఆర్థికంగా, ఇతర అనేక కోణాల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టంచేస్తున్నారు. పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను కేసీఆర్ ప్రభుత్వం అనేక చర్చోపచర్చలు, తర్జనభర్జనలు, ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని 33 జిల్లాలుగా విస్తరించిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా జిల్లా కేంద్రాల్లో వసతులు కల్పించింది. భవనాల › 3వ పేజీలో

జిల్లాల సంఖ్య తగ్గిస్తే కలిగే నష్టాలు

జిల్లా స్థాయి అధికారులు, ఆఫీస్‌లు మళ్లీ ప్రజలకు దూరమవుతాయి

సమీకృత కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు, కమిషనరేట్లు అలంకార ప్రాయంగా మారుతాయి	జిల్లా దవాఖానల స్థాయి పడిపోతుంది. నిధులు, సదుపాయాలు తగ్గిపోతాయి.

జోనల్ వ్యవస్థను మళ్లీ మార్చాల్సి వస్తుంది.

కొత్త జోనల్ వ్యవస్థ వచ్చే వరకు నోటిఫికేషన్లు, నియామకాలు ఉండవు.	ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతారు.

క్యాడర్ స్ట్రెంత్ తగ్గిపోతుంది. ఇది ఉద్యోగుల ప్రమోషన్లపై ప్రభావం చూపుతుంది.

జిల్లాల ప్రాతిపదికన కేంద్రం నుంచి వచ్చే నవోదయ వంటి విద్యాసంస్థలు, నిధులు తగ్గిపోతాయి.	వెనుకబడిన ప్రాంతాల్లోని నిరుద్యోగులకు అన్యాయం



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో శనివారం నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

జిల్లాల రద్దుపై యుద్ధం చేద్దాం

మంచిర్యాలను మాయం చేస్తరట.. కేసీఆర్ ఆనవాళ్లను తుడిపేస్తరట

ఏ ఊరికెళ్తే ఆ ఊరి దేవుడిపై సీఎం ఒట్టు.. నాలుగు నెలల్లోనే అంతా ఆగమాగం

దళితబంధు డబ్బులు వెనక్కి తీసుకున్నరు.. ఎన్నికలైపోగానే సింగరేణి ప్రైవేట్‌పరం

ఈ అన్యాయాలను చూస్తూ ఊరుకోబోం.. మంచిర్యాల రోడ్‌షోలో కేసీఆర్

హైదరాబాద్, మే4 (నమస్తే తెలంగాణ): గిరిజనుల కోసం, ప్రజల కోసం, మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తామంటూ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన మాట చెప్తున్నదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. పాత ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలను ఏర్పాటు చేసుకున్నామని, ఎన్నికల మర్నాడే మంచిర్యాల, నిర్మల్ జిల్లాలను రద్దుచేస్తానని ఈ ముఖ్యమంత్రి అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాల కోసం యుద్ధం చేద్దామని, మంచిర్యాల జిల్లాగా ఉండాలంటే ఈ ఎన్నికల్లో కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. బస్సుయాత్రలో భాగంగా చెన్నూరు ఐబీ చౌరస్తాలో శనివారం నిర్వహించిన రోడ్‌షోలో కేసీఆర్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాల కల అయిన మంచిర్యాల జిల్లాను కేసీఆర్ తెచ్చిండని, దీనిని రద్దుచేస్తే మళ్లీ కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ ఆదిలాబాద్ దారి పట్టాలా? అని ప్రశ్నించారు. మంచిర్యాల జిల్లా కోసం కొట్లాడుదామా? యుద్ధం చేద్దామా? అని ప్రశ్నించారు. మా మంచిర్యాల జిల్లా మాకు ఉండాలంటే బ్యాలెట్ యుద్ధం చేసి ఈశ్వర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.



మంచిర్యాలలో జరిగిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో పెద్దపల్లి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య

కాంగ్రెస్ గ్యారెంటీ మోసం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే తెలంగాణ ఆగమైందని కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. తాగు, సాగునీళ్లు, కరెంటుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో రెప్పపాటు సమయం కూడా కరెంటు ఇప్పుడెందుకు పోతున్నదని ప్రశ్నించారు. నల్లా నీళ్ల ఎక్కడ మాయమయ్యాయని, సీఎం రిలీఫ్ ఫండ్ ఎక్కడికి పోయిందని, కల్యాణలక్ష్మి చెక్కులు ఎక్కడికి పోయాయని నిలదీశారు. రైతుబంధు ఎటుపోయింది? అందుకోసం పెట్టిన నిధులు ఎటుపోయాయని ప్రశ్నించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి, అడ్డగోలు హామీలిచ్చి, నోటికి ఏది వస్తే అది చెప్పిన

> *సింగరేణిని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతున్నది. ముఖ్యమంత్రి దావోస్, స్విట్జర్లాండ్‌లో మాట ముచ్చట మాట్లాడి అగ్రిమెంట్ చేసుకున్నడు. తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణి పోతే మన బతుకులు ఎలా ఉంటాయో ఆలోచించాలి. -కేసీఆర్*

సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఏం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ రోజు ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడి గుడిలో ఒట్లు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9 పోయింది, వంద రోజులు పోయాయని, ఇప్పుడు మళ్లీ ఆగస్టు 15 అంటున్నాడని, నమ్మవచ్చునా? అని నిప్పులు చెరిగారు. 'రుణమాఫీ అయ్యిందా? రైతుబంధు అందరికీ వచ్చిందా? 2500 ప్రతి మహిళకు వచ్చిందా? కల్యాణలక్ష్మి తులం బంగారం వచ్చిందా? అని కేసీఆర్ ప్రశ్నించగా 'లేదు.. లేదు' అని రోడ్‌షోకు హాజరైన ప్రజలు బదులిచ్చారు. 'కరెంటు పోతున్నదా? కోతలు మొదలయ్యాయా?' అని ప్రశ్నించగా 'అవును' అంటూ బదులిచ్చారు. ఆరు గ్యారెంటీల పేరుతో అరచేతిలో వైకుంఠం చూపించి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. అటు మంచినీళ్లు రాక, ఇటు సాగునీళ్లు, కరెంటు ఇవ్వక లక్షల ఎకరాల్లో పంటలను ఎండబెట్టారని, కనీసం కష్టపడి పండించిన పంటలను కూడా కొనే దిక్కులేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. వరికి 500 బోనస్ వస్తున్నదా? అని ఎక్కడ అడిగినా లేదనే చెప్తున్నారని, బోనస్ బోగస్ అయ్యిందని, మద్దతు ధర కూడా లేక రైతులు చచ్చిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రజల బాగు పట్టని మూర్ఖపు ప్రభుత్వం

బీఆర్ఎస్ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పేరు మీద పల్లెలు, పట్టణాలను అభివృద్ధి చేసుకున్నామని కేసీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు పంచాయతీలకు డబ్బులు ఇవ్వడం లేదని, మున్సిపాలిటీల్లో ఊడ్చే పరిస్థితి కూడా లేదని, ఎక్కడికక్కడ చెత్త పేరుకుని పోతున్నదని, హరితహారం చెట్లు, పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయని, యువకుల కోసం పెట్టిన క్రీడా ప్రాంగణాల్లో చెట్లు మొలుస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రారంభించిన చెన్నూరు ఎత్తిపోతల పథకాన్ని కూడా ఆపేశారని, మంచిర్యాల ప్రజల కోసం వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చేపడితే అవి కూడా మొండిగోడలకే పరిమితమయ్యాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఎందుకు ఆపేసిందని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజలకు ఉపయోగపడే అన్నిరకాల పనులను నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'కనీసం స్ట్రీట్‌లైట్లు పోతే వాటిని రిపేర్ చేసే పరిస్థితి లేదు. సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు లేవు. కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు బంద్ చేశారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు బంద్ చేశారు. కొత్త మెడికల్ కాలేజీలకు పర్మిషన్లు తెస్తలేరు. ఐదు నెలలుగా అన్ని రంగాల్లోనూ పనులు నిలిపివేశారు. ఏ ప్రభుత్వం చేసినా ప్రజలకు సంబంధించిన మంచి పనులు ఉంటే కొనసాగిస్తరు. కానీ ఈ మూర్ఖపు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల బాగోగులు పట్టించుకోకుండా జిల్లాలను రద్దు చేస్తాం. కాంప్లెక్స్‌లు, చెన్నూరు లిఫ్ట్, తాగునీళ్ల స్కీంలను ఆపేస్తమని చెప్తున్నది. కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తా అని ముఖ్యమంత్రి అంటున్నడు' అని నిప్పులు చెరిగారు.



గోదావరిఖని శివారులోని వంతెన పైనుంచి గోదావరి మాతకు చీరె, సారెను సమర్పిస్తున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

గోదావరిని పరిశీలించిన కేసీఆర్

గోదావరిఖని, మే 5 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖనికి వచ్చిన కేసీఆర్ శనివారం రాత్రి మంచిర్యాల రోడ్డుషోకు వెళ్తూ పట్టణ సమీపంలోని గోదావరి బ్రిడ్జిపై నుంచి రెండు నిమిషాల పాటు నదిని పరిశీలించారు. నదీ మాతకు బ్రిడ్జిపై నుంచి సారెను సమర్పించారు. గతంలో నిండుకుండలా ఉన్న నది ఇప్పుడు నీళ్లు తగ్గి ఉండడం చూసి ఆవేదన చెందారు. అంతకు ముందు భారీ సంఖ్యలో మహిళలు మంగళ హారతులతో కేసీఆర్‌కు స్వాగతం పలికారు. కేసీఆర్ వెంట మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, నాయకులు కౌశికహరి, దాసరి ఉష ఉన్నారు.

మౌనంగా ఉండే ప్రసక్తే లేదు

బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు పెట్టామని, నేడు వాటిని చూసే దిక్కులేదని, పిల్లలు విష ఆహారం తిని దవాఖానల పాలవుతున్నారని, కొన్ని చోట్ల చనిపోతున్నారని కేసీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. అన్నిరకాల నిర్లక్ష్యం, ఒక అహంకారం, మొండి, మూర్ఖపు వైఖరితో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను శిక్షిస్తున్నదని దుయ్యబట్టారు. 'రేపు రైతుబంధు ఐదు ఎకరాలే వేస్తా అంటడు. మరి ఆరెకరాలు, ఏడెకరాలు ఉన్న వాళ్లు ఏం పాపం చేశారు? వాళ్లకు రైతుబంధు రావద్దా? గోదావరి నదిని నరేంద్రమోదీ ఎత్కపోతా అంటున్నడు. అన్యాయం చేస్తామంటున్నడు. ఊరుకుందామా? ఈ ముఖ్యమంత్రి కుయ్యిలేదు. కృష్ణను తీస్కపోయి ఇప్పటికే అప్పగించిండు. గోదావరిపై నోరు తెరుస్తలేడు. కృష్ణా, గోదావరి పోతే మనలను ఎవరు కాపాడాలె? ఏవిధంగా కాపాడాలె? పార్లమెంట్‌లో

> *ఆరు గ్యారెంటీలని చెప్పి ఒక్కటే పెట్టారు. ఆ ఫ్రీ బస్సుతో ఆడవాళ్లు సిగలు పట్టుకుని కొట్టుకుంటున్నరు. ఈ పథకం వల్ల ఆటోరిక్షా బిడ్డల బతుకులు ఆగమైపోయాయి. ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. -కేసీఆర్*

బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన ఆవశ్యకత ఉన్నది. తెలంగాణ ఆత్మగౌరవం కాపాడాలన్నా, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడాలన్నా? నదుల నీళ్లలో మన హక్కులు మనకు రావాలన్నా? ఢిల్లీ నుంచి నిధులను తేవాలన్నా? మనం బతకాలన్నా? సింగరేణి ప్రైవేట్ పరం కావద్దన్నా? మళ్లా యథావిధిగా తెలంగాణలో సంక్షేమ కార్యక్రమాలు జరగాలన్నా తప్పకుండా బీఆర్ఎస్ గెలవాలి. బీఆర్ఎస్‌కు మీరిచ్చే బలమే నా బలం' అని కేసీఆర్ వివరించారు. 'కాంగ్రెస్ మోసాలపై నిలదీస్తుంటే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. కేసీఆర్.. నీ గుడ్లు తీస్కొని గోలీలు ఆడతా? పేగులు మెడలో వేసుకుంటా? నీ లాగుల తొండలు ఎక్కిస్తా? నిన్ను జైలులో వేస్తా? అని అంటుండు. నేను జైళ్లకు భయపడతనా? భయపడితే రాష్ట్రం వచ్చేదా? చావునోట్లో తలపెట్టి, 15ఏళ్లు రాజీలేని పోరాటం చేసి, మీ బిడ్డగా తెలంగాణను తీస్కొచ్చిన. నా ముందే తెలంగాణకు అన్యాయం చేస్తమంటే, నా ప్రాణాలను బలిపెట్టయినా సరే పోరాడతా తప్ప మౌనంగా ఉండే ప్రసక్తే లేదు' అని కేసీఆర్ స్పష్టంచేశారు.

గొంతెత్తి పోరాడేది బీఆర్ఎస్సే

దళితబిడ్డల కోసం దళితబంధు తెచ్చామని కేసీఆర్ వివరించారు. దళితబంధు తీసుకుని ఇప్పుడు నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నా

> *ముస్లింలకు మేం ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా పంపినం. ఈ సంవత్సరం వారు పంపలే. ఇఫ్తార్ విందులు జరగలే. వాళ్లు ఎవరినీ గౌరవించరు. హిందువు, ముస్లింలు, దళితులను గౌరవించరు. లంబాడా గిరిజనులను గౌరవించరు. -కేసీఆర్*

నని గోదావరిఖనిలో ఓ యువతి చెబితే సంతోషం అనిపించిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 1.3 లక్షల మందికి దళితబంధు మంజూరు చేశామని, ఆ డబ్బులన్నీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వాపస్ తీసుకున్నదని మండిపడ్డారు. 'దళితులు అర్హులు కారా? ఎందుకు వాపస్ తీస్కున్నరు. ఎందుకు ఇవ్వడం లేదు. గిరిజన బిడ్డలకు 4.5 లక్షల ఎకరాలకు పోడు భూములకు పట్టాలు ఇచ్చినం. రైతుబంధు, రైతుబీమా చేసినం. ఇవాళ ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదు. ఒక్క రూపాయి కూడా రైతుబంధు వెయ్యలె. అటు గిరిజనులు, ఇటు దళితులను ఈ ప్రభుత్వం మోసం చేస్తున్నది. ముస్లింలకు ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా పంపించినం. ఈ సంవత్సరం వచ్చిందా? ఇఫ్తార్ విందులు జరిగినయా? వాళ్లు ఎవరినీ గౌరవించరు. హిందువులను, ముస్లింలను, దళితులను గౌరవించరు? లంబాడా గిరిజనులకు ఇవ్వాల్సింది ఇవ్వరు. రైతులను, విద్యార్థులను ముంచుతరు. రాక్షస పాలనను కొనసాగుతున్నది. ఈ అన్యాయాలను అరికట్టాలంటే, న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ గెలివాలి. మీ తరపున గొంతెత్తి పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ' అని వివరించారు.

బీజేపీకి ఓటేస్తే గోదాట్లో వేసినట్టే

నరేంద్రమోదీ పదేండ్ల క్రితం గెలిచినప్పుడు ఇంటికి రూ.15 లక్షలు ఇస్తామన్నాడని, మరి ఇంటింటికీ 15 లక్షలు వచ్చినయా అని కేసీఆర్ ప్రశ్నించారు. అందుకు జనం.. 'లేదు.. లేదు' అని బదులిచ్చారు. 'నిజంగా రాలేదా? మంచిర్యాలలో వచ్చినయట కదా' అని ఎద్దేవా చేశారు. 'భేటీ పడావో.. భేటీ బచావో', 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' ఏమైనా అయిందా? అని ప్రశ్నించారు. రైతుల ఆదాయం రెట్టింపు అయిందా? అని ప్రశ్నించారు. నరేంద్రమోదీది అంతా గ్యాస్ తప్ప మరేమీ లేదని, బీజేపీకి ఓటేసినా, గోదాట్లో పడేసినా తేడా ఏమీ ఉండదని పేర్కొన్నారు.

ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడి పోటీ

పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ ఒక ఆగర్భ శ్రీమంతుడికి, ఒక భూగర్భ కార్మికుడికి మధ్య పోటీ జరుగుతున్నదని కేసీఆర్ తెలిపారు. ఆగర్భ శ్రీమంతుడు ఒకవైపు ఉంటే, 26 ఏండ్లు తట్ట పట్టుకొని, లైట్ పెట్టుకొని బొగ్గు మోసిన భూగర్భ కార్మికుడు మరోవైపు కొప్పుల ఈశ్వర్ మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థిగా ఉన్నారని తెలిపారు. కార్మికుడు గెలవాలా? శ్రీమంతుడు గెలవాలా? అనేది ప్రజలు నిర్ణయించుకోవాలని సూచించారు. సర్వేలన్నీ కొప్పుల ఈశ్వర్ గెలిచినట్టే చెప్తున్నాయని, ఆ విజయాన్ని ఖాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోమారు మోసపోయి గోసపడొద్దని ప్రజలకు సూచించారు. అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని, బీజేపీతో మనకు ఏం ఒరగలేదని, బీఆర్ఎస్సే తెలంగాణకు శ్రీరామ రక్ష అని పేర్కొన్నారు. తెలంగాణ తెస్తానని ఆనాడు చెప్పానని, తెలంగాణ హక్కులు కాపాడతానని ఇప్పుడు చెపుతున్నానని తెలిపారు. 45 డిగ్రీల ఎండ ఉన్నా మంచిర్యాల చరిత్రలో ఎన్నడు లేని విధంగా చౌరస్తా ఈనిండా అన్న విధంగా ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

సింగరేణి ప్రైవేట్‌పరం

తాను గోదావరిఖనిలో చెప్పిన దాన్నే మళ్లీ చెప్తున్నానని, ఆ రోజు ప్రధాని మోదీ తన మెడమీద కత్తిపెట్టి ఆస్ట్రేలియా బొగ్గు, అదానీ బొగ్గు కొనాలని చెప్పినా తాము కొనలేదని, కానీ ఈ రోజు ఈ ముఖ్యమంత్రి పోయి అదానీని ఆహ్వానించాడని కేసీఆర్ మండిపడ్డారు. దావోస్‌లో, స్విట్జర్లాండ్‌లో మాట ముచ్చట మాట్లాడి అగ్రిమెంట్ చేసుకున్నారని ఆరోపించారు. సింగరేణిని కూడా పూర్తిగా ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ కొంగుబంగారమైన సింగరేణి పోతే మన బతుకులు ఎలా ఉంటాయో ఆలోచించాలని కోరారు. కొప్పుల ఈశ్వర్ 26 ఏండ్లు సింగరేణి కార్మికుడిగా పనిచేశారని, ఆయన గెలిస్తే సింగరేణిని కాపాడతాడని భరోసా ఇచ్చారు.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని గెస్ట్‌హౌస్‌లో కేసీఆర్‌తో మాధవరావు ఆయన సోదరి, చిత్రంలో పార్లమెంట్ అభ్యర్థి ఈశ్వర్

ఇదే స్ఫూర్తితో పనిచేయండి

సోషల్ మీడియా వారియర్ మాధవరావుకు కేసీఆర్ సూచన

ప్రభుత్వాన్ని ఎండగట్టినందుకు అభినందన.. అండగా ఉంటామని భరోసా

ధర్మారం, మే 4: 'పార్టీ కోసం అంకిత భావంతో పని చేస్తూ ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును సోషల్ మీడియాలో ఎండగట్టినవ్.. ఇదే స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహంతో పని చెయ్యి.. పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుంది' అని సోషల్ మీడియా వారియర్ సల్వాజీ మాధవరావును కేసీఆర్ భుజం తట్టి ప్రోత్సహించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ మాధవరావు, ప్రభుత్వ వ్యతిరేక పోస్టు పెట్టినందుకు అరెస్ట్ అయి ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యారు. గోదావరిఖనిలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ రాగా కొప్పుల చొరవతో మాధవరావు, అతని సోదరి మాధవి ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో పార్టీ అధినేతను శనివారం కలిశారు. ఈ సందర్భంగా మాధవరావుకు అన్ని విధాలా అండగా ఉంటామని కేసీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీయే పరమావధిగా భావించి పనిచేస్తున్న తనకు కొండంత ధైర్యాన్నిచ్చి నట్లయిందని, కేసీఆర్‌కు రుణపడి ఉంటానని మాధవరావు తెలిపారు.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని తన నివాసానికి వచ్చిన కేసీఆర్‌ను సత్కరిస్తున్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా


పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్


నాగర్‌కర్నూల్ ఎస్పీ కార్యాలయం

జిల్లాలు కదిలిస్తే కల్లోలమే

మొదటిపేజీ తరువాయి...

నిర్మాణాలు మొదలు సిబ్బంది, ఇతర మౌలిక వసతులు.. ఇలా అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. కొత్త జిల్లాల కేంద్రంగా పాలన సవ్యంగా సాగుతున్నది. ఇప్పుడు కొత్తగా మళ్లీ జిల్లాల సంఖ్యను కుదించడం అంటే.. అనేక కొత్త సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

లాభాలు ఎన్నో..

జిల్లా కేంద్రాలు అభివృద్ధికి కేరాఫ్‌గా మారాయి. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయి. ప్రైవేట్ కంపెనీలు, పరిశ్రమలు, బ్యాంకులు, రోడ్లు, రైలు మార్గాలు, ప్రాజెక్టులు.. ఇలా జిల్లా కేంద్రానికి అనేక అదనపు హంగులు చేకూరాయి. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయి. జిల్లా కార్యాలయాలన్నీ అత్యంత సమీపంలోకి వచ్చాయని ప్రజలు సంతోషంగా చెప్తున్నారు. పరిధి చిన్నగా ఉండటంతో పాలనపై కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణ పెరిగింది. దీంతో ప్రజా సమస్యలు వేగంగా పరిష్కారం అవుతున్నాయి. అన్ని శాఖలకు జిల్లా స్థాయి అధికారులు రావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరుతున్నాయి. ఎస్పీ కార్యాలయాలు పెరుగడంతో నియంత్రణ పెరిగి, నేరాలు గణనీయంగా తగ్గాయి. వీటితోపాటు జిల్లా స్థాయిలో ఉండేలా దవాఖానలు, విద్యా సంస్థలు, రోడ్లు, ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రాలకు భారీగా ప్రైవేట్ పెట్టుబడులు కూడా తరలిరావడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తరించాయి. జిల్లా కేంద్రాలు వర్తక, వాణిజ్య, వ్యాపార కేంద్రాలుగా, రాష్ట్రానికి ఆర్థిక వనరులుగా మారాయని ప్రజలు, ఆర్థికరంగ విశ్లేషకులు అంటున్నారు.

నిరుద్యోగులకు అన్యాయం

ఒక ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులు, వసతులను బట్టి కొందరికి మంచి విద్యావకాశాలు దొరికితే, మరికొందరికి సరైన సదుపాయాలు ఉండకపోవచ్చు. ఫలితంగా ఒకే జిల్లాలో ఉండే ఒక ప్రాంతం నిరుద్యోగుల్లో నాలెడ్జ్ లెవల్ ఎక్కువగా ఉంటే, మరో ప్రాంతం అభ్యర్థులు కాస్త వెనుకబడి ఉంటారు. దీంతో ఆ జిల్లాల్లో జరిగే నియామకాల్లో ప్రభుత్వ ఉద్యోగాలన్నీ ఒకే ప్రాంతంవారికి వచ్చేవి. మిగతావారు అన్యాయం అయ్యేవారు. కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేసి ఈ అన్యాయాన్ని చాలావరకు సరిదిద్దింది. ఒకే రకమైన పరిస్థితులు ఉన్న ప్రాంతాలు జిల్లాలుగా మారాయి. ఉదాహరణకు గ్రామీణ పరిస్థితులు ఎక్కువగా ఉండే ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి వంటి ప్రాంతాలు జిల్లాలుగా మారి, ఆయా జిల్లాల నిరుద్యోగులకు న్యాయం కలిగింది. రద్దు చేస్తే వారు తిరిగి అన్యాయానికి గురవుతారు.

కుదిస్తే నష్టం అపారం

జిల్లాల సంఖ్యను కుదించడం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు భారీగా నష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాల సంఖ్యను తగ్గించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్నది అందరి నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. ఇప్పటికీ తమ ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్లే వినిపిస్తున్నాయి తప్ప, తమకు జిల్లా వద్దనే డిమాండ్ ఎక్కడా లేదని, మరి ప్రభుత్వం ఎందుకు ఉబలాట పడుతున్నదని ప్రశ్నిస్తున్నారు.

పర్యవేక్షణ భారం

చిన్న జిల్లాలతో కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా స్థాయి అధికారులకు పరిధి తగ్గింది.. పర్యవేక్షణ పెరిగింది. దీంతో జిల్లాలో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే వారి దృష్టికి వస్తున్నది. తదనుగుణంగా చర్యలు తీసుకొని, సమస్యలను పరిష్కరిస్తున్నారు. పథకాల అమలుతోపాటు నేర నియంత్రణలో చిన్న జిల్లాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. జిల్లాల సంఖ్యను కుదిస్తే మళ్లీ పరిధి పెరిగి, పర్యవేక్షణ లోపం తలెత్తుతుంది. ప్రజల సమస్యలు అధికారుల వద్దకు చేరడానికి సమయం పడుతుంది.

అధికారుల సంఖ్య కుదింపు

కొత్త జిల్లాల ప్రకారం అన్ని శాఖల్లోనూ క్యాడర్‌స్ట్రెంత్‌ను పునర్వ్యవస్థీకరించారు. దీంతో జిల్లా స్థాయి అధికారులతోపాటు ఆయా కార్యాలయాల్లో ఉండే అటెండర్ వరకు అన్ని రకాల పోస్టులు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. ఉద్యోగులకు వేగంగా పదోన్నతులు కలిగాయి. ఇప్పుడు జిల్లాల సంఖ్యను కుదిస్తే.. కలెక్టర్లు మొదలు జిల్లా కేంద్రంలోని అన్ని శాఖల హెచ్‌వోడీలు, ఆయా కార్యాలయాల్లో పనిచేసే అటెండర్ల వరకు వందలాది పోస్టులు రద్దవుతాయి. ప్రభుత్వంలో అధికారుల సంఖ్య తగ్గిపోతుంది. ప్రమోషన్లు నెమ్మదిస్తాయి.

అలంకారప్రాయంగా కార్యాలయాలు

ఒకప్పుడు జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు పుట్టకొకటి చెట్టుకొకటి అన్నట్టుగా ఉండేవి. ప్రజలు రెండుమూడు కార్యాలయాలు తిరగాలంటే రోజంతా పట్టేది. కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతోపాటు.. ప్రతి జిల్లా కేంద్రంలో సమీకృత కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్ భవనాలను నిర్మించింది. రద్దు చేసిన జిల్లా కేంద్రాల్లో ఆయా భవనాలు అలంకారప్రాయంగా మారుతాయి.

మళ్లీ జోన్ల విభజన

జిల్లాల సంఖ్య మార్పుతో జోన్ల విభజన కూడా కచ్చితంగా జరగాల్సి వస్తుంది. నూతన జోనల్ వ్యవస్థను రూపొందించాలి. దానికి అసెంబ్లీ ఆమోదం తీసుకొని, ఆ తర్వాత రాష్ట్రపతి ఉత్తర్వుల కోసం పంపాలి. అక్కడ ఆమోదం తర్వాతే కొత్త జోనల్ వ్యవస్థ అమల్లోకి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి అనుమతుల ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం ఒకటి రెండేండ్లు పడుతుంది. అప్పటివరకు ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వడానికి ఆస్కారం ఉండదు. ఫలితంగా నిరుద్యోగులు నష్టపోతారు.

ప్రజాప్రతినిధుల పోస్టులూ ఉఫ్

కొత్త జిల్లాల ఏర్పాటుతో జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, గ్రంథాలయ చైర్మన్ వంటి ప్రజాప్రతినిధుల పోస్టుల సంఖ్య కూడా పెరిగింది. రాజకీయంగానూ జిల్లాల సంఖ్య తగ్గించడం పార్టీలకు ఇబ్బంది కలిగిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు. జిల్లాల వారీగా పార్టీలు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, అనుబంధ కమిటీలు ఇలా వందలాది మందికి ప్రాతినిధ్యం కల్పించాయి. వారంతా ఇప్పుడు పదవులు కోల్పోయే అవకాశం ఉంటుంది.

'జిల్లా' ప్రాజెక్టులకు మంగళం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా కేంద్రంగా అనేక ప్రాజెక్టులు చేప్టటాయి. ఉదాహరణకు జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చివరి దశలో ఉన్నది. వాటికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీలు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లా కేంద్రంలోని దవాఖానలను ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తున్నది. ఇలాంటి పథకాలు ఇప్పుడు గందరగోళంలో పడతాయి. జిల్లా దవాఖానలకు కేంద్రం నుంచి నిధులు వస్తుంటాయి. ఇవి ఆగిపోవడంతోపాటు జిల్లా దవాఖాన హోదా కోల్పోయి, వసతులు తగ్గిపోతాయి. వెనుకబడిన జిల్లాలు వంటివి జిల్లా ఆధారంగానే గుర్తిస్తుంటారు. ఇలాంటివన్నీ ఆగిపోతాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

'రియల్' ఢమాల్

కొత్త జిల్లాలు పెట్టుబడులను ఆకర్షించే కేంద్రాలుగా మారాయి. ప్రైవేట్ కంపెనీలు తరలివస్తున్నాయి. ముఖ్యంగా రియల్‌ఎస్టేట్ రంగం విపరీతంగా పెరిగింది. సమీప గ్రామాల నుంచి ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వలసలు పెరిగి నిర్మాణాలు పెరిగాయి. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. జిల్లాల రద్దుతో రియల్‌ఎస్టేట్ రంగం కుదేలవుతుంది.

మళ్లీ వలసలు మొదలు

జిల్లాలను రద్దు చేస్తే అప్పటికే ఆ ప్రాతంలోకి వచ్చిన ప్రైవేట్ పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోతాయి. ఫలితంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతాయి. మొత్తంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఆలోచనతో ప్రయోజనం దాదాపు శూన్యమని, ఇదే సమయంలో నష్టం మాత్రం అపారంగా ఉంటుందని నిపుణులు, సామాన్య ప్రజలు హెచ్చరిస్తున్నారు.

ప్రాతిపదిక ఏమిటి?

కొత్త జిల్లాల ఏర్పాటుకు అసలు ప్రతిపాదిక ఏమిటని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా కొత్త జిల్లాల ఏర్పాటుకు జనాభా, జనసాంద్రత, భౌగోళిక విస్తీర్ణం, ఆ ప్రాంత ప్రజల జీవనశైలి, ప్రజల నుంచి వచ్చే డిమాండ్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో జరిగిన కొత్త జిల్లాల ఏర్పాటులో ఇలాంటి పద్ధతినే పాటించారు. కానీ, ప్రభుత్వం ఇప్పుడు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏపీలో కూడా ఇటీవల జరిగిన జిల్లాల పునర్విభజనలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటుచేశారు. ఇదే తరహాలో తెలంగాణలో చేస్తే.. 33 జిల్లాలకు మిగిలేవి 17 మాత్రమే. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ఉన్నదని, మరి అప్పుడు కూడా మళ్లీ కొత్త జిల్లాలు ఏర్పాటుచేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

జిల్లా కేంద్రం.. మళ్లీ దూరం

ఉమ్మడి జిల్లాల్లో ప్రజలు జిల్లా అధికారులను కలువాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. అనేక సందర్భాల్లో రాత్రికి అక్కడే బస చేసి, మరుసటి రోజు తిరిగి రావాల్సి వచ్చేది. తద్వారా ఒకటి రెండు రోజులు సమయం వృథాతోపాటు బస్సు చార్జీలు, తిండి, హోటల్ గది అద్దె.. ఇలా ఆర్థికంగా భారం అయ్యేది. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ సగటున 50-80 కిలోమీటర్ల దూరంలోనే జిల్లా కేంద్రం అందుబాటులోకి వచ్చింది. దీంతో పొద్దున్న బయల్దేరి వెళ్లి మధ్యాహ్నానికో, సాయంత్రానికో తిరిగి వస్తున్నారు. ఒక్క రోజులోనే పని పూర్తవుతున్నది. కొన్నిచోట్ల మధ్యాహ్నానికే ఇంటికి తిరిగి వచ్చేంత సులభం అయ్యిందని ప్రజలు అంటున్నారు. జిల్లాలను కుదిస్తే మళ్లీ ఆ తిప్పలు మొదలవుతాయి.

జిల్లాలను రద్దు చేస్తే కాంగ్రెస్ భూస్థాపితమే

మాజీ ఎమ్మెల్యేలు గంప, జాజాల

కామారెడ్డి, మే 4: కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త జిల్లాలను రద్దు చేస్తే ఆ పార్టీ భూస్థాపితం కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల సురేందర్ హెచ్చరించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని అన్నారు. కామారెడ్డిలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న కామారెడ్డి జిల్లా జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా వచ్చే ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీకి తాళాలు పడే రోజులు వస్తాయని, ఇప్పటికే 20 శాతం బస్సులు డిపోలకే పరిమితమైనట్టు వారు పేర్కొన్నారు. పదేండ్లలో బీజేపీ దేశానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ధాన్యం కొనాలని ఢిల్లీకి వెళ్లి అడిగితే నూకలు తినాలని కేంద్ర మంత్రులు చెప్పిన విషయాన్ని వారు గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి నూకలు బుక్కిస్తారని తెలిపారు. మతం పేరుతో బీజేపీ నేతలు మాట్లాడితే వాళ్ల మీద కేసులు ఉండవు, కానీ కేసీఆర్ మాట్లాడితే మాత్రం కేసులు పెడతారని ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లాను రద్దు చేసి, 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న జహీరాబాద్‌ను జిల్లాగా చేయాలని యత్నిస్తున్నారని మండిపడ్డారు. కామారెడ్డి జిల్లాను రద్దు చేయడం లేదని ఈ నెల 13లోపు ప్రకటించకపోతే ఉద్యమాన్ని లేవదీస్తామని హెచ్చరించారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, జాజాల


నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పించినందుకు కరీంనగర్ జిల్లా వీణవంకలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి

జిల్లాలను తొలగిస్తే ప్రజా ఉద్యమం

దానికి నాయకత్వం వహించేది బీఆర్‌ఎస్సే

- తుగ్లక్‌ను మరిపిస్తున్న రేవంత్ పాలన
- ధరలు పెంచేసిన పిరమైన మోదీని గద్దెదించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- సిరిసిల్లలో వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

రాజన్న సిరిసిల్ల, మే 4 (నమస్తే తెలంగాణ): జిల్లాలను యథాతథంగా కొనసాగించకుంటే ఉద్యమం తప్పదని, దీనికి బీఆర్‌ఎస్ నాయకత్వం వహిస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన జిల్లాలను అలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు పెంచేసిన 'పిర'మైన మోదీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సిరిసిల్ల పట్టణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా కేటీఆర్ విస్తృత ప్రచారం చేశారు. వెంకంపేట చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేతన్నలపై తమ వైఖరేంటో ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక గోదావరిలో నీళ్లు మాయమయ్యాయని, సిరిసిల్లలో బోర్లు ఎత్తిపోతున్నాయని, ప్రజలు గొంతెండి నీళ్ల కోసం అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల పంటలు ఎండిపోతున్నా సీఎం ఒక్కమాట కూడా మాట్లాడడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సిగ్గుమాలిన ప్రభుత్వం, తుగ్లక్ పాలనను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. రుణమాఫీ, తులం బంగారం, రూ. 4 వేల పెన్షన్, స్కూటీలు ఇస్తానని చెప్పి పొంకనాల పోతిరెడ్డిలా డైలాగులు కొట్టారని ధ్వజమెత్తారు.

ఏ జిల్లాలను తొలగిస్తారు?

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేశామని, ఇప్పుడేమో పార్లమెంటు నియోజకవర్గానికి ఒకటి చొప్పున 17 జిల్లాలే ఉండాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అదే జరిగితే ఏ జిల్లాలు ఉంచుతారో, వేటిని తొలగిస్తారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు ఉన్నాయని, వీటిలో దేనిని తీసేస్తారని ప్రశ్నించారు. నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో నిజామాబాద్, జగిత్యాలలో ఏ జిల్లాను ఉంచుతారని నిలదీశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు ఉన్నాయని, వీటిలో దేనిని తీసేస్తారని, అదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో దేనిని ఎత్తేస్తారో దమ్ముంటే ప్రజలకు చెప్పాలని సవాలు విసిరారు. తెలంగాణలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. ఊసరవెల్లి రంగులు మారిస్తే రేవంత్‌రెడ్డి తేదీలు మారుస్తున్నారని దుమ్మెత్తిపోశారు. చిన్న జిల్లాల ఏర్పాటుతో అధికారులు ప్రజలకు చేరువయ్యారని, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు. 'నా తప్పు నేను తెలుసుకున్నా.. నాకు బుద్ధి వచ్చింది. చెంపలేసుకుంటున్నా.. జిల్లాలను యథాతథంగా కొనసాగిస్తున్నా' అని సిరిసిల్ల సభలో సీఎం చెప్తాడని ప్రజలు భావించారని పేర్కొన్నారు.

అంతా ఉల్టానే

కేసీఆర్ ఏం చేస్తే దానికి ఉల్టా చెయ్యాలని రేవంత్‌రెడ్డి లక్ష్యంగాపెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ రూ. 3వేలకోట్ల విలువైన బతుకమ్మ చీరలకు ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల నేతన్నల బతుకులు నిలబెట్టారని కేటీఆర్ ప్రశంసించారు. నేత కార్మికులు నెలకు రూ. 15 వేల నుంచి రూ. 20 వేలు సంపాదించుకుంటూ గౌరవప్రదంగా జీవించారని పేర్కొన్నారు. రేవంత్ వచ్చాక రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక, బతుకమ్మ చీరలు కట్ చేశారని ఆగ్రహం మండిపడ్డారు. హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుచేస్తే దానికి కనీసం దండ వేసి నివాళులు అర్పించకుండా తాళం వేసి చెరలో బంధించిన మూర్ఖుడు సీఎం అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ విధానాలతో తిరిగి సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలు ప్రారంభమయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం బతుకమ్మ చీరలకు రూ. 3 వేల కోట్ల ఆర్డర్లు ఇచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే రూ. 6వేల కోట్ల ఆర్డర్లతో చీరలు తయారు చేయించాలని సవాలు విసిరారు. సమావేశంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్‌డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గతంలోనే ఆర్‌ఎస్‌పీని ఆహ్వానించా

బీఆర్‌ఎస్‌లో చేరాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గతంలో తానే ఆహ్వానించానని కేటీఆర్ తెలిపారు. అప్పుడు సున్నితంగా తిరస్కరించిన ఆయన ఆ తర్వాత తన కోరిక మేరకు పొత్తుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కవిత అరెస్ట్ తర్వాత బీఎస్పీ నేతల నుంచి ఒత్తిడి పెరగడంతో బీఆర్‌ఎస్‌లో చేరారని వివరించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగలేదని తెలిపారు. పార్టీలో అన్ని పదవులు అనుభవించిన కేశవరావు, కడియం శ్రీహరి, రంజిత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి అధికారం పోగానే పార్టీలు మారారని, అలాంటిది అధికారంలో లేకున్నా మాట ప్రకారం ప్రవీణ్‌కుమార్ బీఆర్‌ఎస్‌లో చేరడం గొప్ప విషయమని కేటీఆర్ ప్రశంసించారు.


మల్కాజ్‌గిరి పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వినోద్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిస్తేనే మనకు గౌరవం

కష్టకాలంలో బీఆర్‌ఎస్‌లో చేరి అండగా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌తో ఉన్న బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంటుకు, బీఆర్‌ఎస్‌కు, మనకు గౌరవం పెరుగుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. దేశం సుభిక్షంగా, ప్రశాంతంగా ఉండాలని, సుపరిపాలన, సమపాలన అందించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రెండు జాతీయ పార్టీలు (కాంగ్రెస్, బీజేపీ) రద్దు చేసే ప్రమాదమున్నదని హెచ్చరించారు. 35 పార్టీలను ఒప్పించి, తెలంగాణ సాధించిన కేసీఆర్‌తోనే దీనిని ఆపడం సాధ్యమని పేర్కొన్నారు.

ఆర్నెల్లలో రాష్ట్ర రాజకీయాలను శాసిద్దాం

- హైదరాబాద్ యూటీకి కుట్ర
- బీఆర్‌ఎస్‌కు 10-12 సీట్లు ఇవ్వండి : కేటీఆర్

మేడ్చల్, మే 4 (నమస్తే తెలంగాణ): 'బీఆర్‌ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు ఇవ్వండి. మళ్లీ ఆరు నెలల్లోనే రాష్ట్ర రాజకీయాలను కేసీఆర్ శాసించే పరిస్థితి వస్తుంది' అని ప్రజలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లోని షాపూర్‌నగర్ చౌరస్తా, కంటోన్మెంట్‌లో మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితకు మద్దతుగా రోడ్‌షోల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇండియా, ఎన్డీయే కూటమిలో లేని 13 పెద్ద పార్టీలు ఉన్నాయని, ఎన్నికల తర్వాత ఈ పార్టీలే ఢిల్లీని శాసించవచ్చని అన్నారు. అత్యధిక ఎంపీ సీట్లు సాధించి మనం ఢిల్లీని లొంగదీసుకుందామా? లేకా యాచిద్దామా? అని ప్రశ్నించారు.హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని బీజేపీ దుష్ట ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. పార్లమెంట్‌లో తెలంగాణకుగొంతు ఉండాలంటే గులాబీ కండువా ఉండాలని తెలిపారు. మోదీ 2 కోట్ల ఉద్యోగాలు, పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేయగా, సీఎం రేవంత్ 6 గ్యారెంటీల పేరుతో మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేం బీజేపీతో కలుస్తున్నామని ఆరోపిస్తున్నరు. నా చెల్లి, ఎమ్మెల్సీ కవితను జైల్లో పెట్టింద్రు. అలాంటి బీజేపీతో మేం కలుస్తమా?' అని అడిగారు. ఇక, 2014, 2019ల్లో మోదీ హవా ఉన్నా బీజేపీని ఓడించింది బీఆర్‌ఎస్సేనని స్పష్టం చేశారు. తండ్రి, సోదరి చనిపోయినా కంటోన్మెంట్ ప్రజలే తన కుటుంబమని ముందుకొచ్చిన కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదితను గెలిపించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. 'మీ బిడ్డలా భావించి నివేదితను భారీ మెజార్టీతో గెలిపించండి. మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించి తెలంగాణ గొంతుకను పార్లమెంట్‌లో వినిపించాలి' అని కోరారు. రోడ్‌షోలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శిగమూగిన మంచిర్యాల!

- కేసీఆర్ రోడ్ షో సూపర్ సక్సెస్
- జనసంద్రమైన మంచిర్యాల ఐబీ చౌరస్తా
- సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు
- కొత్త జిల్లాలు రద్దు చేయొద్దని ముక్తకంఠంతో నినాదాలు

మంచిర్యాల, మే 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ శనివారం నిర్వహించిన రోడ్ షో సూపర్ సక్సెస్ అయ్యింది. మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, సింగరేణి కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరాగా ఆ ప్రాంతం జనసంద్రమైంది. గోదావరిఖని నుంచి మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించిన బస్సుయాత్రకు ఇందారం, మంచిర్యాల ఓవర్ బ్రిడ్జి వద్ద మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించడానికి ముందు గోదావరి నదీ దగ్గర బస్సు ఆపిన కేసీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచే అశేష జనవాహిని కేసీఆర్ ఎదురువెళ్లి ఘన స్వాగతం పలికి తోడ్కొని ఐబీ చౌరస్తాకు తీసుకురావడంతో మూడు ప్రధాన రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్, మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బస్సులోకి వెళ్లి కేసీఆర్‌కు స్వాగతం పలికారు. బస్సు యాత్ర ఐబీ చౌరస్తాలోకి వచ్చేటప్పటికే ఇటు లక్షెట్టిపేట, అటు బెల్లంపల్లికి, చెన్నూర్ వైపు వెళ్లే రహదారులన్నీ జనంతో కిటకిటలాడాయి. మంచిర్యాల చరిత్రలోనే ఇలాంటి జనప్రవాహాన్ని చూడలేదంటూ సాక్షాత్తూ కేసీఆరే చెప్పేంతగా జనం తరలివచ్చారు. కేసీఆర్ బస్సు మీదకు రాగానే జనం సీఎం.. సీఎం.. అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వారిని వారించేందుకు ప్రయత్నించినా వినకుండా కాసేపు నినాదాలు చేశారు. దాదాపు 20 నిమిషాలపాటు కేసీఆర్ మాట్లాడగా, జనం ఆసక్తిగా విన్నారు.

కేసీఆర్ నోట.. జనం మాట..

ఐదు నెలల కాంగ్రెస్ పాలనపై జనంలో ఉన్న అభిప్రాయమే కేసీఆర్ నోట ప్రతిధ్వనించింది. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయా? అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు.. ప్రజలు లేదు.. లేదు అని సమాధానాలిచ్చారు. 2 లక్షల రుణమాఫీ అయ్యిందా? రైతుబంధు అందరికీ వచ్చిం దా? మహిళలకు రూ.2500 వస్తున్నాయా? అని ప్రశ్నించినప్పుడు ప్రజలు రాలేదు.. రాలేదు అని చెప్పారు. ఆపై కేసీఆర్ చమత్కరిస్తూ.. మీరు తప్పు చెప్తున్నరు.. రూ 5వేలు వస్తున్నయట కదా.. అనగా, దానికి సమాధానంగా ప్రజలు రాలేదని చెప్పారు. జిల్లాల రద్దు విషయంలో ప్రజలు ఎంత వ్యతిరేకతతో ఉన్నారో ఈ రోడ్ షోతో అర్థమైపోయింది. మంచిర్యాల జిల్లా ఉండాల్నా.. పోవాల్నా.. ఈ ముఖ్యమంత్రి జిల్లాలను తీసేస్త అంటున్నడు అని కేసీఆర్ అనగానే.. జనం జిల్లా ఉండాలని ముక్తకంఠంతో నినాదాలు చేశారు.

పెద్దపల్లిలో గెలుపు ఖాయం చేసిన కేసీఆర్..

పెద్దపల్లి పార్లమెంట్‌లో కొప్పుల ఈశ్వర్ బంపర్ మెజార్టీతో గెలుస్తున్నాడని కేసీఆర్ చెప్పారు. బస్సుయాత్ర మొదలైనప్పటి నుంచి బీఆర్‌ఎస్ గ్రాఫ్ పెరిగిందనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో పెద్దపల్లిలో ఈశ్వర్ గెలుపు ఖాయం అంటూ కేసీఆర్ చెప్పడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పెద్దపల్లిలో ఆగర్భ శ్రీమంతుడికి.. భూగర్భ కార్మికుడికి మధ్య పోటీ ఉందని..సింగరేణిని కాపాడుకోవాలం టే కార్మికుడు గెలవాల్నా.. మరెవరు గెలవాల్నా..ఆలోచించుకోవాలంటూ కేసీఆర్ చెప్పారు. అన్ని సర్వేలు పెద్దపల్లి నియోజకవర్గంలో కొప్పుల ఈశ్వర్ గెలిచినట్లు చెప్తున్నయ్.. అంటూ కేసీఆర్ ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. బస్సు యాత్రతో మంచిర్యాల నగరం మొత్తం గులాబీమయమైపోయింది. ఇందారం మొదలుకొని మంచిర్యాల వరకు ఎటుచూసినా గులాబీ జెండాలు, భారీ కటౌట్‌లే కనిపించాయి.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

హామీల సాలెగూడులో రేవంత్



టంకశాల అశోక్

హామీల అమలులో వైఫల్యం విషయం ప్రజలకు స్పష్టంగా తెలిసిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈసరికి బాగానే అర్థమైనట్టున్నది. వైఫల్యం గురించి ప్రతిపక్షాలు మాట్లాడటం వేరు, స్వయంగా ప్రజలు మాట్లాడటం వేరు. వాస్తవాలు ప్రతిపక్షాలకు మాత్రమే తెలిసినప్పుడు ముఖ్యమంత్రి మానసిక స్థితి ఒకవిధంగా ఉంటుంది. ఆ దశలో మానసిక ధైర్యం సడలిపోదు. ప్రతిపక్షాలను తేలికగా ఎదురుకోగలనని నమ్ముతారు. ఆ ప్రకారం విమర్శకులపై ఎదురుదాడి, బుకాయింపులు ఉంటాయి. ఆ విధంగా చెలాయించవచ్చుననుకుంటారు. రేవంత్‌రెడ్డి అటువంటి ప్రయత్నం కొద్దివారాల పాటు చేశారు కూడా. ఒకవేళ హామీల వైఫల్యం కొద్దిస్థాయిలో ఉండి ఉంటే, ప్రతిపక్షాలు ఎంత విమర్శించినా అది చెల్లుబాటుకాకపోయేది. ముఖ్యమంత్రి ఎదురుదాడి ఎత్తుగడ ఫలించేది.

కాంగ్రెస్ హామీల్లోని ఒక్కొక్క అంశాన్ని పరిశీలిస్తే.. వంద రోజుల్లో 6 గ్యారంటీలలోని 13 హామీల అమలులో వైఫల్యాలు చాలా పెద్దవి. అదే పద్ధతిలో తేదీలతో సహా గడువు పెట్టినవి రూ.2 లక్షల రైతు రుణమాఫీ వంటివి మరికొన్ని ఉన్నాయి. ఈ వైఫల్యాల గురించి ప్రతిపక్షాల విమర్శలు మామూలే అనుకున్నా, ఆ మాట ప్రజలకు సైతం అర్థమైందనుకున్నప్పుడు మాత్రం ముఖ్యమంత్రి మానసిక స్థితి మారుతుంది. విమర్శలను బుకాయింపులతో తోసిపుచ్చగలననే ధీమాకు బదులు కలవరపాటు మొదలవుతుంది. ఎదురుదాడుల వల్ల ఉపయోగం ఉండదని తెలిసిపోవటం ఒక నిస్సహాయ స్థితి. అపుడు కలవరపాటు మరింత పెరుగుతుంది.

ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయం ఒకటున్నది నిస్సహాయ స్థితి బయటి పరిస్థితుల వల్ల ఏర్పడటం కన్న, అంతర్గత పరిస్థితుల వల్ల ఏర్పడటం ఎక్కువ ప్రమాదకారి. హామీల అమలులో వైఫల్యం ఒక వాస్తవమని ముఖ్యమంత్రికి తెలుసు. ఇతరుల విమర్శలకన్న ఎక్కువగా తెలుసు. ఏ విధంగానైతే ఆర్థిక పరిమితులు ప్రస్తుత వైఫల్యానికి కారణమయ్యాయో, అవే పరిమితులు రాగల కాలంలో మరింత తీవ్రమైన వైఫల్యాలకు కారణం కాగలవని కూడా తెలుసు. కేవలం అధికార సంపాదన కోసం ఇచ్చిన అసాధ్యపు హామీలు తనకొక కత్తుల బోనును సృష్టించాయని తనకు ఈ తొలిదశలోనే అర్థమైనట్టు కనిపిస్తున్నది. అయితే ఈ వాస్తవాలలో దేనిని కూడా ఇప్పుడాయన మార్చలేరు. మార్చలేరన్నది గ్రహించలేనివాడేమీ కాదాయన. వాస్తవానికి ఇది తాను ఈ రాష్ట్రస్థాయిలోనే గాక, తమ కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం అధికార రాహిత్యపు ఎడారిలో నీటిచుక్కల కోసం నాలుక పిడచగట్టుకపోతుండగా, సోకాల్డ్ కృత్రిమ స్ట్రాటజిస్టులపై ఆధారపడి, తమ సొంత వివేకానికి, దశాబ్దాల అనుభవానికి తిలోదకాలిచ్చి, తయారుచేయిస్తున్న వ్యూహాల అఖిల భారత ఊబిలో ఇదొక భాగం మాత్రమే. దానినుంచి ఏ రాష్ట్ర నాయకుడైనా కోరుకున్నప్పటికీ తప్పించుకోలేడు.

ఇటువంటి స్థితిలో రేవంత్‌రెడ్డి హామీలను అమలుచేయలేరు, వాటినుంచి వెనుకకు పోలేరు గనుక, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల రూపంలో ఒక కొత్త విపత్తు వచ్చిపడింది గనుక, ఇవి ముగియగానే స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో మరొక విపత్తు ఎదురుచూస్తున్నది గనుక, ఆయనకు మిగిలిన ఎత్తుగడలు కొన్నుంటాయి. మిగిలిన పరిష్కారాలు కాదు, మిగిలిన ఎత్తుగడలని గుర్తించాలి.

ఏదో ఒకవిధంగా వీలైనంత ప్రతిష్ఠను కాపాడుకోవటం ఆయన ప్రస్తుత అవసరం గనుక, తన మానసిక స్థితి కూడా అందుకు తగినట్టే ఉంటుంది. ఆ ప్రకారం ప్రస్తుతం తనకు మిగిలిన ఎత్తుగడల్లో ఒకటి, ఏదేమైనా సరేనని అవే అసత్యాలు ప్రతిరోజు, ప్రతిసభలో, ప్రతి మీడియా సమావేశంలో, అవకాశం లభించే ప్రతి సందర్భంలో మరింత గొంతెత్తి చెప్తూ పోవటం. రెండు, 6 గ్యారంటీలలోని 13 హామీల గురించి గాని, తేదీలతో



సహా గడువులు ప్రకటించిన ఇతర హామీల గురించి గాని ఎందరెందరు ఎన్నెన్నిసార్లు సూటిగా ప్రశ్నలు వేసినా ఒక స్థితప్రజ్ఞుని వలె వాటి జోలికిపోకపోవటం, వాటిని అసలు విననైనా విననట్లు నటించటం, తాము అటువంటి హామీలే ఇవ్వలేదన్నట్టు దిక్కులు చూడటం. మూడు, ఆయా హామీల గురించి తమ మంత్రులు, పార్టీ నాయకులు తలొక విధంగా విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నా వారిని సరిదిద్దకపోవటం, అసలేమీ మాట్లాడకపోవటం. అందువల్ల ప్రజల్లో అయోమయం ఏర్పడితే ఆ అయోమయం కూడా ప్రతిపక్షాల విమర్శలకు జవాబు కాగలదనే తెలివైన అంచనాలు. నాలుగు, ప్రజల దృష్టిని హామీల నుంచి రకరకాలుగా మళ్లించజూడటం. ఐదు, ప్రత్యర్థులపై రోజుకొక కొత్త ఆరోపణ, సవాళ్లు, కేసులు, లీకులు, సోషల్‌మీడియా కథనాలతో ప్రజల్లో వీలైనన్ని అయోమయాలు సృష్టించడం. ఆరు, ప్రజలు తమను, తమ మాటలను, మ్యానిఫెస్టోలను, హామీలను నమ్మడం తగ్గిపోతున్నదని గ్రహించడంతో, వారిని నమ్మించేందుకు ఆధునిక ప్రజాస్వామిక పద్ధతులను వదిలివేసి, మధ్యయుగాల్లో వలె రోజుకు ఒకరిద్దరు దేవుళ్ల మీద ఒట్లు పెట్టడం. ఆ విధంగా తమ మానసిక బలహీనతను, నైతిక బలహీనతను, విశ్వసనీయత లేమిని చాటుకోవడం. అయితే ఇక్కడ రేవంత్‌రెడ్డి గాని, ఆయన పార్టీ గాని, సాధారణ ప్రజలు గాని గమనించవలసింది ఒకటి ఉంటుంది. ముఖ్యమంత్రి తన ఆత్మరక్షణ స్థితి నుంచి, అటువంటి మానసిక స్థితి నుంచి అనుసరించే ఈ విధమైన ఎత్తుగడలు ఒకవేళ ప్రజల దృష్టిని హామీల అమలు నుంచి మళ్లించగలిగితే తప్పక ఫలితముంటుంది. కానీ మళ్లించలేకపోతే, తగిలే ఎదురుదెబ్బ మామూలు కన్నా తీవ్రంగా ఉంటుంది.

ముఖ్యమంత్రి అనూహ్యమైన రీతిలో ఎటువంటి పరిస్థితిలో చిక్కుకుపోయారో గమనించండి. తన ప్రస్తుత ఇరకాటపు మానసికస్థితికి మూలం అందులోనే ఉంది. ఆయన రుణమాఫీని ఆగస్టు 15 లోగా చేసితీరతామని భీకరమైన ప్రతిజ్ఞలు చేస్తారు. ఎందుకు అవసరమవుతున్నదో, ఎందువల్ల అటువంటి ఒత్తిళ్లు ఏర్పడుతున్నాయో గాని, కనిపించిన దేవుడి మీదనల్లా ఒట్లు పెట్టుకుంటారు. స్వయంగా ప్రకటించిన డిసెంబర్ 9 గురించి ఈ అయిదు మాసాల్లో మాత్రం ఒక్కటంటే ఒక్కసారైనా, పొరపాటునైనా మాట్లాడలేదు. కనీసం, డబ్బులు కుదరలేదు అర్థం చేసుకోగలరు అంటూనైనా రైతులను కోరలేదు. ఆయన ఆత్మాభిమానం అంతటిది అనుకోవాలి కావచ్చు.

అట్లాగే, ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేస్తానని, హరీశ్‌రావు తన రాజీనామాను సిద్ధం చేసుకోవాలని ప్రతిరోజు సవాలు విసురుతారు. కాని, ఒకవేళ మాఫీ చేయలేకపోతే తాను రాజీనామా చేస్తానని మాత్రం పొరపాటునైనా అనరు. ఎందుకు అనటం లేదంటే, మౌనం వహిస్తారు. ఈ రుణమాఫీ సవాళ్లు ఎదురుసవాళ్ల మధ్య 6 గ్యారంటీలు, 13 హామీల మాట మాత్రం పక్కకుపోవటం గమనించదగ్గ విశేషం.

ఆ ఆరు గ్యారంటీలలో అయిదు అమలుచేశామని పదే పదే ప్రకటిస్తారు. ఏమిటా అయిదంటే సమాధానమివ్వరు. ఎన్నిసార్లు లెక్కలు వేసినా అవేమిటో మనకూ తెలియవు. ఆరు గ్యారంటీల వందరోజుల గడువు ఎట్లాగూ గడిచిపోయింది. మరి కొత్త గడువేమిటో నేటివరకూ చెప్పటం లేదు. అందుకు కూడా ఆగస్టు పదిహేనా? అదైనా మాట్లాడరు. రుణమాఫీకి కొత్త గడువు ఆగస్టు 15 అంటూ తనను సవాలు చేస్తున్న ముఖ్యమంత్రి, కనీసం ఆ తేదీనాటికి అయినా 6 గ్యారంటీలలోని 13 హామీలు అమలు చేయగలరా అని హరీశ్‌రావు అడిగితే, ముఖ్యమంత్రి నుంచి ఎటువంటి స్పందన ఉండదు. రుణమాఫీ గురించి మాత్రమే మాట్లాడి ఊరుకుంటారు. దాన్నిబట్టి, అప్పటికైనా 6 గ్యారెంటీలకు గ్యారంటీ లేదనుకోవాలా?

తనకు తాను సృష్టించుకున్న ఇక్కట్లలో చిక్కుకుపోయిన రేవంత్‌రెడ్డి, ఈ విధమైన మానసిక స్థితిని కూడా తనకు తానే సృష్టించుకున్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా అన్ని పార్టీలు, అందరు నాయకుల మాటలు వింటున్న ప్రజలు, వీళ్లందరి తిట్లు తమకెందుకని, ప్రజల కోసం, సమస్యల కోసం, అభివృద్ధి కోసం ఏం చేస్తారో చెప్పాలని కోరుతున్నారు. అదట్లుండగా, తమ హామీలన్నీ ప్రజలకు సంబంధించినవే కాగా, వాటి అమలులో విఫలమైన ముఖ్యమంత్రి, వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు తాజాగా రెండు కొత్త అంశాలపై ప్రచార ఉధృతిని పెంచారు. ఇది కూడా తన ప్రస్తుత మానసిక స్థితి నుంచి వచ్చిన ఎత్తుగడే. ఆ రెండు అంశాల్లో ఒకటి బీజేపీని, మోదీని ఎన్నడూ లేని ఘాటుతనంతో విమర్శించడం. రెండు, తెలంగాణలో అన్ని సీట్లు గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలనటం. యథాతథంగా ఆ విమర్శల్లో, ఆ కోరికలో ఆక్షేపించవలసిందేమీ లేదు. కాని ఆయన రహస్య ఉద్దేశం ప్రజల దృష్టిని హామీల అమలు నుంచి ఆ రెండు విషయాల వైపు మరల్చడం. ఆ పేరిట ఘన విజయం సాధిస్తే హామీల అమలు కోసం ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడి నుంచి తప్పించుకోగలగటం. ఆత్మరక్షణ వ్యూహం బాగానే ఉంది. కానీ, ఫలితాలు మరొక విధంగా ఉంటే? అప్పుడు హామీల కోసం ప్రజల ఒత్తిడి ఏ విధంగా ఉండవచ్చునో ముఖ్యమంత్రి తన అంచనాలకు తాను రావచ్చు. అప్పుడిక ఏ ఎత్తుగడలూ ఆదుకోవేమో.

రాష్ట్రానికి కాంగ్రెస్ చేటు, దేశానికి బీజేపీ చేటు



కనకదుర్గ దంటు
89772 43484

నైజాం రాష్ట్రం (తెలంగాణ) భారతదేశంలో విలీనమైనప్పటి నుంచి ఈ ప్రాంతం మీద గత 75 ఏండ్లుగా అప్రతిహతంగా సాగుతున్న అన్యాయాలకు ఆద్యుడు జవహర్‌లాల్ నెహ్రూ! అసలు దేశంలో ఈ ప్రాంత కలయికే అబద్ధాల మీద జరిగింది. నిజాం మీద ఒకవైపు సాయుధ పోరాటం, ఇంకోవైపు రజాకార్ల ఒత్తిడి ఉన్నప్పుడు నిజాంకు కేఎం మున్షీ అనే పెద్దమనిషితో నెహ్రూ ఒక వర్తమానం పంపాడు. మున్షీ.. భారతీయ విద్యాభవన్ స్థాపకుడు, రచయిత, స్వాతంత్ర్య పోరాటయోధుడు, అందరూ గౌరవించే న్యాయవాది.

నిజాంకు నెహ్రూ పంపిన వార్త ఏమిటంటే.. హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేస్తే, నిజాం తన రాష్ట్రాన్ని తానే స్వతంత్రతతో పాలించుకోవచ్చని, ఈ వ్యతిరేకుల నుంచి భారతదేశం ఆయనను కాపాడుతుందని. అయితే ఈ మాట వినటానికి బాగుంటుంది. కానీ, ఆ వెనుక సర్దార్ పటేల్‌తో నెహ్రూ చెప్పిన మాట సరిగ్గా దీనికి వ్యతిరేకం. నిజాం రాజు కలవటానికి ఒప్పందం మీద సంతకం చేయగానే భారత సైన్యంతో నిజాం రాష్ట్రాన్ని ఆక్రమించమని పటేల్‌కు చెప్పారు నెహ్రూ. అంతేకాదు, కేఎం మున్షీని నిజాంకు కనపడకుండా ఆ సమయానికి వెళ్లిపొమ్మని చెప్పాడు. తర్వాత చరిత్ర తెలిసిందే! సుసంపన్న దేశంగా వెలిగిన నిజాం రాష్ట్రాన్ని మిలిటరీ ఆక్రమించి, నిజాంను రాజ్‌ప్రముఖ్‌గా మార్చి, 1953 దాకా మిలిటరీ పాలనలో చేయని అకృత్యం లేదు. రజాకార్లు 3,000 మందిని చంపితే, సైన్యం దాడుల్లో 30,000 మంది హైదరాబాదీలు చనిపోయినట్టు అంచనా.

1952లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరిగి తెలంగాణ ప్రాంతం కొద్దిగా ఊపిరి తీసుకునేసరికి అన్యాయం చేయటానికి నెహ్రూకు ఇంకో అవకాశం కలసివచ్చింది. భావసారూప్యత, భాషా సారూప్యత లేని ఆంధ్ర ప్రాంతాన్ని తెలంగాణతో కలిపి రెండో ఘోరమైన అన్యాయం చేశాడు. అమాయకురాలు, అమిత భాగ్యవంతురాలైన ముక్కు పచ్చలారని పిల్లని, అడుక్కుతింటున్న ఒక అల్లరి పిల్లాడికి ఇచ్చి పెళ్లి చేస్తున్నానని ప్రకటన చేసి మరీ తెలంగాణకు తీరని అన్యాయం చేశాడు నెహ్రూ ఆంధ్రా లాబీకి లొంగి!

మొదటిసారి నెహ్రూ చేసిన అన్యాయం నాలుగేండ్లయితే, రెండోసారి చేసిన ఘోరం 44 ఏండ్లు అనుభవించింది తెలంగాణ. నెహ్రూ వారసులు ఒక్కొక్కళ్లు చేసిన అన్యాయాలు తక్కువేం లేవు. పుష్కరకాలం భరించి, ఇక తాళలేక 1969లో ప్రపంచంలోనే అతి సుదీర్ఘ ఉద్యమం 9 నుంచి 10 నెలలు చేస్తే.. దానికి కాంగ్రెస్ ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి.. విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు చదువుతున్న 369 మంది ప్రాణాలు ప్యారడైజు రోడ్డు మీద హరించి, వారి రక్తం ఏరులై పారితే దానితో ఇందిరాగాంధీకి తర్పణాలర్పించారు. నెహ్రూ కూతురు ఇందిరాగాంధీ ఏమీ తక్కువ తినలేదు. తెలంగాణకు జరిగిన అన్యాయాల మీద వేసిన కమిటీలను తొక్కిపెట్టింది. లలిత్ భార్గవ్ కమిటీల్లాంటివి 1957 నుంచి తెలంగాణకు జరిగిన అన్యాయాలు, అగ్రిమెంట్ల ఉల్లంఘన విశదంగా వివరించినా, ఆవిడ లెక్కచేయలేదు. కంటి తుడుపుకి చెన్నారెడ్డిని ముఖ్యమంత్రిని చేసినా, ఆంధ్రా కుటిల రాజకీయ నాయకులు ఆయననీ పాలన చేయనీయకుండా టర్మ్ కాకుండానే దింపించేశారు. ఇక తర్వాత తెలుగుదేశం పాలన తెలంగాణ దోపిడీకే పనికివచ్చింది. రెండెకరాల ఆసామి లక్ష కోట్ల రూపాయలు సంపాయించుకున్నాడు. అంతేకాదు, తెలంగాణ వారినే తెలంగాణకు వ్యతిరేకంగా తీర్చిదిద్దాడు. వారందరిలో బాబు పాఠాలు బాగా నేర్చుకున్నవాడు ప్రస్తుత ముఖ్యమంత్రి. సోనియాగాంధీ కాలంలో 1200 మంది బలిదానాలు ఆయనకు కనపడవు. ఆవిడ వారసులు రాహుల్, ప్రియాంక చెప్పిన అబద్ధాలు పదేపదే చెప్పి అధికారంలోకి వచ్చాడు. ఇదివరకటి కాంగ్రెస్ పాలనలోని అన్యాయాలు గుర్తులేని వారికీ, తెలియనివారికీ ఈయన పాలనలో తెలంగాణ పట్ల కాంగ్రెస్ ఎటువంటి మోసాలు చేస్తుందో తెలియదు కదా! మరి అసెంబ్లీ ఎలక్షన్లలో ఆయన మాటలు నమ్మి బోర్లా పడ్డాం. మరి ఈ పథకాలన్నీ పార్లమెంట్ ఎన్నికలకు ముడిపెట్టి 'ఆగస్టులో ఇస్తాం, సెప్టెంబర్‌లో ఇస్తాం' అంటే మళ్లీ మాయల ఫకీరుని నమ్మి బోర్లాపడదామా? 1948 నుంచి ప్రతి విషయంలో మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాకుండా చేసి బుద్ధి చెబుదామా? ఇంత వెంటవెంటనే మోసపోయేటంత తెలివి తక్కువదా తెలంగాణ? ఆలోచించండి. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికలను గెలిచినప్పుడు రాష్ట్ర ఖజానాలో సిద్ధంగా ఉన్న రూ.7,700 కోట్ల రైతుబంధు నిధులను గెలిచినా కూడా పెట్టుబడి సాయంగా రైతులకు ఇవ్వనివాడు



ఇప్పుడేమైనా ఇస్తాడా? మోదీ అబద్ధాలు, చంద్రబాబు మోసాలు కలిపి మనిషిని చేస్తే రేవంత్‌రెడ్డి అవుతాడు. మళ్లీ ఆయనను నమ్ముతారా? ఆలోచించండి!

ఇక బడాభాయ్ ప్రధానమంత్రి. ప్రతి భారతీయుడికీ రూ.15 లక్షలు ఇస్తానని 2014లో చెప్పిన బలి చక్రవర్తి సామాన్యుల సర్వస్వాన్ని అదానీ, అంబానీలకు సమర్పిస్తున్నారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజల 45 శాతం ఆస్తులు తీసేసుకుంటుందని ప్రచారం చేస్తున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఎలాగూ గెలిచేది లేదు, కానీ మోదీ గెలిస్తే మాత్రం 45+50 కలిపి ప్రజల 95 శాతం ఆస్తి అదానీ, అంబానీ లాంటి ఇతర గుజరాతీ వ్యాపారస్థుల చేతుల్లోకి వెళ్లడం మాత్రం ఖాయం.

అంతేకాదు, అమూల్ పాలు, అదానీ మాలు తప్ప దేశంలో ఇంకే కంపెనీకి చెందిన వస్తువులు అమ్ముకునేందుకు కుదరదు. ఒకవేళ బీజేపీ మూడోసారి గెలిచిందంటే ఒక్క తెలంగాణ కాదు, అన్ని రాష్ట్రాలు దివాలా తీస్తాయి. గత పదేండ్లలో పెరిగిన ధరల శాతం 68. ఇక మోదీ చేతిలో మళ్లీ దేశాన్ని పెడితే శ్రీలంక గతే భారత్‌కు పడుతుంది. ఇప్పుడు తెలంగాణ కట్టిన పన్నులతో నాలుగైదు ఉత్తరాది రాష్ట్రాలు బతుకుతున్నాయి. ఇంకా మోదీకే అధికారమిస్తే ఆంధ్రా పాలకుల కంటే ఎక్కువగా అనగా సింగరేణిని అదానీకి, పంటపొలాలను అంబానీకి కట్టబెడతారు. ప్రతి ఎన్నిక సమయంలో మోదీ ఎన్ని అబద్ధాలు చెప్పారో గుర్తు తెచ్చుకోండి. 'అచ్చేదిన్, కాస్తా 'చచ్చేదిన్' అయిపోయింది. రెట్టింపు చేస్తానన్న రైతు ఆదాయం సగం కంటే తక్కువైంది. 'బేటీ పడావో' మాట మారి 'బేటీ చిడావ్' అయింది. బలాత్కారాలు, హత్యలు చేసినవాళ్లు కాలరేగసుకొని బయట తిరుగుతున్నారు. వారికి సన్మానాలు జరుగుతుంటే.. వారి పిల్లలకు ఎన్నికల్లో టికెట్లు దొరుకుతున్నాయి. పాల మీద, పాఠశాల పుస్తకాల మీద కూడా పన్నులేసి మోదీ తన స్నేహితులకు కట్టబెడుతున్నారు. విదేశీ పత్రికలన్నీ ప్రస్తుతం భారత్ నియంత పాలన కింద ఉందని రాస్తున్నాయి. రాజకీయంగా నేరస్థులను ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా సామాన్యులను కుంగదీస్తూ, సామాజికంగా మతమౌఢ్యంతో ప్రజలను విడదీస్తూ, విద్యాపరంగా దేశాన్ని నాశనం చేస్తూ, ఆరోగ్యపరంగా వైద్య వృత్తిని కుంగదీస్తూ.. నరేంద్ర మోదీ దేశానికి చేసిందేముంది?

నాలుగేండ్లు రాముడి గుడి అని అయోధ్య జపం చేసి, చివరికి ప్రపంచానికి ఆదర్శమైన జంట విగ్రహాలైనా పెట్టకుండా బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారక్కడ. సీత, రాముడు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు ఉంటేనే ఎవరైనా సరే రామ పట్టాభిషేకం అని పూజిస్తారు. చెప్పుకొంటే సిగ్గుచేటు. ఇట్లాంటి వాళ్లను వదిలేసి చదువు, తెలివి, వివేకం, లోకజ్ఞానం ఉన్నవారిని నాయకులుగా ఎన్నుకున్నప్పుడే రాష్ట్రాలయినా, దేశాలయినా బాగుపడతాయి. తెలంగాణ ప్రజలారా! గత తొమ్మిదేండ్లు ఎట్లా బతికామో గుర్తు తెచ్చుకోని ఓటు వేయండి!

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే రెండు విడతలు పూర్తయ్యాయి. మూడో విడత ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే కృత్రిమమేధ కారణంగా పుట్టుకొస్తున్న డీప్‌ఫేక్‌ల వల్ల తప్పుడు సమాచారం, తప్పుదోవ పట్టించే వార్తల వ్యాప్తి అంతకంతకూ పెరుగుతున్నది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసే సందర్భంలో భారత ఎన్నికల సంఘం కూడా దీని గురించి ఆందోళన వ్యక్తం చేసింది. సామాన్యులతో పాటు జర్నలిస్టులు, ప్రభుత్వాలు, ఎన్నికల కమిషన్‌కు కూడా వీటిని గుర్తించడం కష్టసాధ్యంగా మారుతుండటం ఆందోళనకరం.

ప్రజాతీర్పుపై డీప్‌ఫేక్‌ల ప్రభావం



ఎడిటోరియల్ డెస్క్

ఏఐ సాంకేతికతను వినియోగించి తయారు చేసిన వీడియోలు, ఫొటోలు, 3డీ హోలోగ్రామ్‌లను వాట్సాప్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో షేర్ చేస్తూ ఓటర్లకు దగ్గరయ్యేందుకు పార్టీలు, అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మన దేశంలో మొట్టమొదటగా 2012 నాటి గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మోదీకి సంబంధించిన 3డీ హోలోగ్రామ్‌ను వినియోగించారు. హైదరాబాద్‌కు చెందిన అవంతారి టెక్నాలజీస్ అనే కంపెనీ దీన్ని రూపొందించడం విశేషం. ప్రస్తుతం అవంతారితో పాటు పాలిమాత్ సొల్యూషన్స్, మొనియమ్ లాంటి అనేక కంపెనీలు ఏఐ రంగంలో సేవలందిస్తున్నాయి. పెరుగుతున్న సాంకేతికత, సోషల్ మీడియా కారణంగా ఎన్నికల్లో ఏఐ వినియోగం ఎక్కువైంది. ప్రస్తుత ఎన్నికల్లో వివిధ పార్టీలు, అభ్యర్థులు ఏఐ ఆధారిత ప్రచారం కోసం సుమారుగా రూ.415 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నాయంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఏఐ ప్రచారం కోసం ఒక్కో అభ్యర్థి సుమారుగా రూ.10 లక్షలకు పైగానే ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. తమిళనాడుకు చెందిన దివంగత ముఖ్యమంత్రి కరుణానిధికి సంబంధించిన ఏఐ వీడియో రూ.10 లక్షలకు చేసి పెట్టినట్టు మొనియమ్ కంపెనీ తెలిపింది. ప్రతి ఓటరును చేరుకునే వీలుండటంతో కొన్ని పెద్ద పార్టీలు 10 మిలియన్ డాలర్లకు (రూ.83 కోట్లు) పైగా ఖర్చు చేయడానికి కూడా వెనుకాడటం లేదు. కొన్ని పార్టీలు తమ ప్రచార ఖర్చులో సుమారుగా 20 శాతానికి పైగా ఏఐ సేవల కోసం వినియోగిస్తున్నాయి. పార్టీలే కాకుండా కొంతమంది సంపన్న అభ్యర్థులు ఒక్క ఏఐ ప్రచారం కోసమే అనధికారికంగా (80 -90 వేల డాలర్లు) రూ.70 లక్షలకు పైగా వెచ్చిస్తున్నట్టు తెలుస్తున్నది. ఏఐ సేవలపై దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్ణాటకల్లో ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో ఉత్తరాదిలోని బీహార్ రాష్ట్రం ఈ విషయంలో వెనుకబడి ఉన్నది.

ఏఐ ఆధారిత సేవలు అందించే కంపెనీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. ఒకే రాష్ట్రానికి లేదా ప్రాంతానికి చెందిన ప్రత్యర్థి పార్టీలు, అభ్యర్థులతో ఒకే సమయంలో అవి పని చేయడం లేదు. సేవలను బట్టి, కంపెనీలను బట్టి వీటి ధరలు మారిపోతున్నాయి. పాలిమాత్ కంపెనీ వాయిస్ క్లోనింగ్ కోసం రూ.60 వేలు వసూలు చేస్తుండగా.. అవాంతరి సంస్థ రూ.10 లక్షలు తీసుకుంటున్నది. పాలిమాత్ కంపెనీ డిజిటల్ అవతార్ క్రియేషన్ కోసం రూ.లక్ష, వాట్సాప్ ఇంటిగ్రేషన్ కోసం రూ.2 లక్షల వరకు వసూలు చేస్తున్నది. అదే సమయంలో అవాంతరి సంస్థ ఒక వీడియో మెసేజ్ కోసం రూ.25, ఒక వాట్సాప్ మెసేజ్ కోసం రూ.30 వరకు తీసుకుంటున్నది.


అయితే డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉన్నందున మన దేశంలో డీప్‌ఫేక్‌లు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఓ నివేదిక ప్రకారం.. భారత్‌లో 38 శాతం మంది మాత్రమే డిజిటల్ అక్షరాస్యతను కలిగి ఉన్నారు. నగరాల్లో డిజిటల్ అక్షరాస్యత 61 శాతంతో పోలిస్తే.. గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతమే ఉండటం గమనార్హం.

గతేడాది నవంబర్‌లో సినీ నటి రష్మిక మందన్నకు సంబంధించిన డీప్‌ఫేక్ వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన అనంతరం 10 రోజుల్లో డీప్‌ఫేక్‌లకు సంబంధించి ముసాయిదా చట్టాన్ని తీసుకొస్తున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. కానీ, అదే నెలలో ముసాయిదా చట్టానికి బదులుగా ఏఐ సంబంధిత కంపెనీలకు సలహాలు, సూచనలు జారీ చేయాలని యోచిస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు. ఆ తర్వాత ఐటీ రూల్స్, 2021కి కొత్త నియమ, నిబంధనలను జోడించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. కానీ, దానిపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది.



రాజకీయ పార్టీలకు టెక్నాలజీపై అవగాహన ఉండటంతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అవి డీప్‌ఫేక్‌లను విరివిగా వాడుతున్నాయి. తద్వారా ప్రజాతీర్పును ప్రభావితం చేసేందుకు విఫలయత్నం చేస్తున్నాయి. వాటి నుంచి పారదర్శకతను ఆశించలేని పరిస్థితి నెలకొంది. డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేసేందుకు 'ఇతిసార్' అనే ఏఐ డిటెక్షన్ టూల్‌ను ఐఐటీ జోధ్‌పూర్ రూపొందించింది. ఈ టూల్‌ను న్యూస్ ఆర్గనైజేషన్ బూమ్ వాడుతుండటం గమనార్హం. ఇలాంటి టూల్‌లను వినియోగించి కొంతమేరకు డీప్‌ఫేక్‌లు, తప్పుడు వార్తలను అడ్డుకుంటున్నప్పటికీ శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు. ఇటువంటి టూల్‌ల వ్యయం ఎక్కువ కావడం, వాటి కచ్చితత్వం తక్కువగా (70 శాతమే) ఉండటం ప్రతికూలాంశంగా మారుతున్నది. డీప్‌ఫేక్‌లను సృష్టించడం చాలా చౌక కాగా.. వాటిని అడ్డుకునేందుకు అయ్యే ఖర్చు ఎక్కువగా ఉండటం అసలు సమస్యగా మారుతున్నది.

ప్రస్తుత ఎన్నికల్లో ఏఐ పరిమితమైన పాత్రనే పోషిస్తున్నది. కానీ, భవిష్యత్తులో అంటే 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి చాలా కీలకమైన పాత్ర పోషించే అవకాశం లేకపోలేదు. ఏఐ సాంకేతికత కారణంగా ప్రజా తీర్పు ప్రమాదంలో పడే ముప్పును ఎదుర్కొంటున్నది. ఈ తరుణంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత కలిగిన ఎన్నికల సంఘం కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నది. డిజిటల్ మీడియా అక్షరాస్యతను పెంచే దిశగా ఎన్నికల సంఘంతో పాటు సోషల్ మీడియా కంపెనీలు పెట్టుబడులు పెట్టాలి. ముఖ్యంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలి. తద్వారా డీప్‌ఫేక్‌లను అరికట్టి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. లేదంటే రానున్న రోజుల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం కావడం ఖాయం.



ఇదే మొదటిసారి కాదు!



అమేఠీని వీడి రాహుల్ గాంధీ పారిపోవడం ఇదే మొదటిసారి కాదు. 2019లోనూ ఆయన ఇలాగే చేశారు. కాకపోతే, అప్పుడు ప్రత్యామ్నాయంగా వయనాడ్‌ను ఎంచుకున్నారు. కానీ, ఈసారి అసలు పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నారు. అమేఠీలో గాంధీ కుటుంబం గెలిచే అవకాశమే ఉండి ఉంటే, వారు పోరాడేవాళ్లు కదా?

- స్మృతి ఇరానీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి

- ముద్దొచ్చిన అభిమానం



సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముషీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ మెడలోని గులాబీ కండువాపై ఉన్న కేసీఆర్ బొమ్మను ముద్దాడుతున్న వృద్ధుడు

నటనలో రేవంత్‌కు ఆస్కార్ రావొచ్చు!

- అంతటి నటనా కౌశల్యం ప్రదర్శన
- పాత హామీలే అమలుచేయని హస్తం
- మ్యానిఫెస్టోల పేర్లు మారుస్తూ రకరకాల హామీలిస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ నేత పొన్నాల ఆగ్రహం

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): నటనలో సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు రావొచ్చని, అంతటి నటనా కౌశల్యాన్ని ప్రదర్శిస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకే దిక్కులేదు కాని.. పార్లమెంట్ ఎన్నికల కోసం రకరకాల పేర్లతో కొత్త మ్యానిఫెస్టోలను విడుదల చేస్తున్నదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల కోసం పాంచ్‌న్యాయ్, 25 హామీలతో మరో మ్యానిఫెస్టోను విడుదల చేశారని విమర్శించారు. ఎన్నికలు ఏడు రోజులు ఉండగా ఓట్ల కోసం కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేసిందని ఎద్దేవా చేశారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారంలోకి వస్తామనే ధీమా లేదని, అందుకే తాము అధికారంలోకి వస్తే అని అంటున్నారని ఎద్దేవాచేశారు. ఆరు గ్యారెంటీలు, 13 పథకాల ఎక్కడ అమలయ్యాయో చెప్పాలని రేవంత్‌రెడ్డికి పొన్నాల సవాల్ విసిరారు. డిసెంబర్ 9నే అమలుచేస్తామన్న రుణమాఫీ ఏమైందని నిలదీశారు. రేవంత్‌రెడ్డి అబద్ధాలు, నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మల్కాజిగిరి ఎంపీగా ఆ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పి రేవంత్‌రెడ్డి అక్కడ ఓట్లు అడగాలని హితవు పలికారు. గాడిద గుడ్డు అంటున్న రేవంత్‌రెడ్డి, తన హామీలు కూడా గాడిద గుడ్డు అనే విషయాన్ని మరిచారని విమర్శించారు.



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

బీజేపీది సమాజాన్ని చీల్చే కుట్ర

రామమందిరం పేరుతో సమాజాన్ని చీల్చే కుట్ర బీజేపీ చేస్తున్నదని పొన్నాల ఆరోపించారు. ఓట్ల కోసం రామమందిరాన్ని బీజేపీ పావుగా వాడుకుంటున్నదని విమర్శించారు. రామమందిరానికి బీజేపీకి సంబంధం ఏమిటని నిలదీశారు. రామమందిరం తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చిందని, రామమందిరాన్ని కట్టింది ట్రస్ట్ అని, మధ్యలో బీజేపీ ప్రచారం చేసుకోవడాన్ని ఆయన ప్రశ్నించారు. బీజేపీ సర్కారు నల్ల చట్టాలు తెచ్చి కొన్ని వందల మంది రైతులను పొట్టన పెట్టుకున్నదని విమర్శించారు. కేంద్రంలోని మోదీ సర్కారు పదేండ్లలో రూ.4.50 లక్షల కోట్ల ప్రభుత్వ రంగ ఆస్తులను విక్రయించిందని ఆరోపించారు. దీనిపై చర్చించడానికి బీజేపీ నేతలు సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. బీజేపీ చెప్తున్నట్టు పదేండ్లలో మూడు కోట్ల ఇండ్లు కట్టలేదని, కట్టిన 1.40 కోట్ల ఇండ్లు కూడా బీజేపీ పాలిత ఏడు రాష్ట్రాల్లోనూ కట్టారని, చేసిందని కొంత అయితే, చెప్పేది కొండంత అని ఎద్దేవా చేశారు.

హామీలను గాలికొదిలేసిన రేవంత్ సర్కార్

ఐదు నెలలైనా అమలుకాని ఆరు గ్యారెంటీలు • మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శ

భీమ్‌గల్, మే 4: హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీలకు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆయన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం బెజ్జోర, పిప్రి గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన రోడ్‌షోలో వేముల మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే వందరోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలను మరిచిపోయిందని మండిపడ్డారు. ప్రభుత్వం ఏర్పడి ఐదునెలలైనా హామీలు అమలుకు నోచుకోవడంలేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెడుతూ ఐదు నెలలు గడిపారని ఆరోపించారు. మోసం చేసిన రేవంత్ సర్కార్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్కరోజు కూడా ప్రజల మధ్యకురాని బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఓట్ల కోసం మరోసారి రావడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పిప్రి గ్రామంలో ఉపాధి హామీ మహిళ కూలీతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం

- లోక్‌సభ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు
- కాంగ్రెస్ హామీ ఇచ్చిన గ్యారెంటీలు బౌన్స్
- అందుకు ఆ పార్టీకి ప్రజలు శిక్ష వేయాలి
- రివర్స్‌గేర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన
- ఎన్నికల్లో హస్తం పార్టీ ఓటమి ఖాయం
- టీయూడబ్ల్యూజే మీట్ ది ప్రెస్‌లో హరీశ్



బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఎన్టీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమాసుధీర్

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం రాబోతున్నదని, రివర్స్ గేర్‌లో పోతున్న కాంగ్రెస్ నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు వచ్చాయని, ఈ ఎన్నికల్లోనూ అవే ఫలితాలు రాబోతున్నాయని వెల్లడించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. కేసీఆర్ బస్సుయాత్రకు ప్రజల్లో ఆదరణ లభిస్తున్నదని, మహిళలు, రైతులు, యువత కేసీఆర్‌కు అడుగడుగునా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. రైతులు, మహిళలు, పెన్షన్‌దారులు కేసీఆర్‌ను గుర్తుచేసుకుంటున్నారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కంటే బీఆర్ఎస్‌కే ఎక్కువ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ గ్యారెంటీలు బౌన్స్ అయ్యాయని, అందుకు ఆ పార్టీకి ప్రజలు శిక్ష వేయాలని చెప్పారు. చెక్ బౌన్స్ తరహాలో కాంగ్రెస్ రాసిచ్చిన ఆరు గ్యారెంటీల బాండ్ పేపర్ బౌన్స్ అయ్యిందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు బాండ్ పేపర్ ప్రామిస్‌లు, పార్లమెంట్ ఎన్నికలప్పుడు దేవుళ్ల మీద ప్రామిస్‌లు అన్నట్టు కాంగ్రెస్ వ్యవహారం ఉన్నదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పరిపాలనలేదని, పగ, ప్రతీకారాలే కనిపిస్తున్నాయని తెలిపారు. సీఎం ప్రతిపక్షాల గొంతునొక్కడమే పనిగా పెట్టుకొన్నారని, సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తున్నారని చెప్పారు.

దివాలా తీసిందంటే పెట్టుబడులొస్తాయా?

రాష్ట్రం దివాలా తీసిందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలను హరీశ్‌రావు తప్పుబట్టారు. ముఖ్యమంత్రే ఇలా చెబితే పెట్టుబడులు వస్తాయా? అని ప్రశ్నించారు. రేవంత్ మాటల వల్ల రియల్ ఎస్టేట్ కుదేలైందని, పెట్టుబడులు రావటంలేదని చెప్పారు. రాష్ట్రంలో మోటర్లు కాలిపోవటం, పంటలు ఎండిపోవటం, విద్యుత్తు కోతలు, నీటి కొరత, పోలీసు కేసులు, నిర్బంధాలు వంటి మార్పు మొదలైందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వాసుపత్రుల్లో జరగాల్సిన డెలివరీలు ప్రైవేట్ దవాఖానల్లో జరగటం వంటి మార్పును ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఐదు నెలల్లోనే వద్దురో నాయన కాంగ్రెస్ పాలన అని ఛీదరించుకుంటున్నారని వెల్లడించారు.

గ్యారెంటీలు ఫెయిల్

ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారెంటీలు అమలు చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పడం సత్యదూరమని హరీశ్‌రావు స్పష్టంచేశారు. 'మహాలక్ష్మీ పథకంలో ప్రతి మహిళకు రూ.2,500, రైతుభరోసా రూ.15 వేలు, ధాన్యానికి రూ.500 బోనస్, వందరోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు రూ.5 లక్షలు, రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు, నిరుద్యోగ భృతి, చేయూత కింద రూ.4 వేల పెన్షన్ తదితర గ్యారెంటీల అమలులో సర్కారు ఫెయిల్ అయ్యిందని మండిపడ్డారు. 91 లక్షల తెల్లరేషన్ కార్డుదారులుంటే గృహజ్యోతి పథకాన్ని 30 లక్షల మందికే ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలతో పాటు నాలుగో డీఏను పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజాపాలనలో స్వీకరించిన 3.5 లక్షల దరఖాస్తుల్లో ఎన్ని పరిష్కరించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ది మూడోస్థానమే

పార్టీ మారితే వెంటనే అనర్హత వేటు వేయాలని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చేర్చారు. కానీ, బీఆర్ఎస్ నుంచి చేర్చుకున్న ఎమ్మెల్యేలున్న వేదికపైనే ఈ మ్యానిఫెస్టో ప్రకటించారు. ఇదేం నీతి? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని, మెదక్, సికింద్రాబాద్, వరంగల్‌లో కాంగ్రెస్‌ది మూడోస్థానమేనని తెలిపారు. 'వడ్లు కొనటం చేతగాని బీజేపీ తెలంగాణలో ఓట్లు ఎలా అడుగుతుంది? నూకలు బుక్కమన్న ఆ పార్టీకి రైతులు ఎందుకు ఓటు వేయాలి? బీజేపీ తెలంగాణకు ఏమిచ్చింది? కేసీఆర్ కంటే ధార్మికుడు, భక్తుడు బీజేపీలో ఎవరూ లేరు. గతంలో దేవాలయాల నిధులు ఇతర అవసరాలకు వాడేవారు. కానీ, దేవాలయాలకు ప్రభుత్వ నిధులు ఇచ్చింది కేసీఆర్ మాత్రమే. బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చే అబద్ధపు హామీలతో ప్రజల గుండెలు మండుతున్నాయి' అని వెల్లడించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యాయని విమర్శించారు. తలా 8 సీట్ల చొప్పున గెలుచుకునే ఒప్పందం ఇరుపార్టీల మధ్య కుదిరిందని ఆరోపించారు. టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీటీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఉమాసుధీర్ సంధానకర్తగా వ్యవహరించగా, టీయూడబ్ల్యూజే నాయకులు సత్యనారాయణ, శంకర్‌గౌడ్, షౌకత్ పాల్గొన్నారు.

అడ్డిమార్ గుడ్డి దెబ్బలా రేవంత్ సీఎం

దుబ్బాక, మే 4: అడ్డిమార్ గుడ్డి దెబ్బలా రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని మాజీమంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో, అక్బర్‌పేట-భూంపల్లి, నారాయణరావుపేటలో నిర్వహించిన రోడ్‌షోల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి పొద్దున లేస్తే కేసీఆర్‌పై తిట్లు.. లేకపోతే దేవుళ్లపై ఒట్లు తప్ప రాష్ట్ర ప్రజల కోసం ఆలోచించటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలన రివర్స్‌లో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ తెలంగాణను సంక్షేమం, అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా నిలిపితే, రేవంత్‌రెడ్డి తన సీటు కాపాడుకోవటానికే ఆరాటం పడుతున్నాడని ధ్వజమెత్తారు. కేంద్రంలో ఉన్న బీజేపీ దేవుళ్ల ఫొటోలతో ఓటు బ్యాంకు రాజకీయం చేస్తే, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు దేవుళ్లపై ఒట్లు వేసి ప్రజలను మోసగిస్తున్నదని మండిపడ్డారు. బీజేపీ పేదలపై పన్నుల భారం (జీఎస్టీ) మోపి అదానీ, అంబానీలను పోషిస్తున్నదని ఆరోపించారు. చివరికి బీడీ కార్మికులను సైతం వదలలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కట్టలపై పుర్రెగుర్తు తీసుకొచ్చి కార్మికుల పొట్టకొడితే, బీజేపీ అధికారంలోకి వచ్చాక జీఎస్టీ విధించి కార్మికులను రోడ్డుపై పడేసిందని వెల్లడించారు. విద్యావంతుడు, కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డిని ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వినతాభూంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రావు, రాజమౌళి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, వంశీ కార్తిక తదితరులు పాల్గొన్నారు.

సొంత అభ్యర్థులనే కాపాడుకోలేని కాంగ్రెస్

- మ్యానిఫెస్టో హామీలను ఎలా అమలుచేస్తుంది?
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): సొంత పార్టీ అభ్యర్థులతో సరిగా నామినేషన్లు వేయించలేని, ఎన్నికల్లో పోటీకి సహకరించని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన అడ్డగోలు హామీలను ఎలా తీరుస్తుందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇప్పటికే ఒక కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించారని, మరో ఇద్దరు పోటీ నుంచి తప్పుకున్నారని, తాజాగా ఒడిశాకు చెందిన సుచిత్రా మొహంతి పోటీలో ఉండలేనని చేతులెత్తేశారని పేర్కొన్నారు. ప్రచార ఖర్చుకు పార్టీ డబ్బు ఇవ్వడం లేదని ఆమె పోటీ నుంచి తప్పుకున్నారని, సొంత అభ్యర్థులనే కాపాడుకోలేని ఆ పార్టీ.. దేశంలో బీజేపీతో యుద్ధమెలా చేస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలకే ఇప్పటికీ అతీగతీ లేదని, ఇప్పుడు కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలతో ఇప్పించిన హామీలను అమలు చేసే దమ్ము ఆ పార్టీకి ఉన్నదా అని ప్రశ్నించారు. ఇదంతా కేవలం ప్రజలను బురిడీ కొట్టించి ఓట్లు వేయించుకోవడానికి చేస్తున్న డ్రామాలు తప్ప, వీళ్లకు ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదని పేర్కొన్నారు.



మహబూబాబాద్ జిల్లా పొనుగోడులో ఉపాధి పనుల వద్ద ఓ వృద్ధురాలితో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత

బిడ్డా.. నిన్నే గెలిపించుకుంటం

- ప్రచారానికి వెళ్లిన బీఆర్ఎస్ అభ్యర్థి కవితను దీవించిన మహిళలు

గూడూరు, మే 4 : బిడ్డా సల్లంగ ఉండు.. మళ్లీ నిన్నే గెలిపించుకుంటం. మాకు పింఛన్, తాగునీరు రావాలంటే మళ్లీ నువ్వే గెలవాలి.. కేసీఆర్ సారే రావాలి' అంటూ ప్రజలు బీఆర్ఎస్ మానుకోట ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను దీవించారు. శనివారం ఆమె స్థానిక నాయకులతో కలిసి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గూడూరు, బొల్లేపల్లి, పొనుగోడు, అయోధ్యపురం, మధనాపురం, గాజులగట్టు, బొద్దుగొండ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వారిని ఆప్యాయంగా పలుకరిస్తూ ఓటు అభ్యర్థించారు. గూడూరు మండల కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పూరీలు చేసి కస్టమర్లకు అందిస్తూ వినూత్న ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీలు మారితే వచ్చే నష్టమేమి లేదని, ప్రజల్లో బీఆర్ఎస్‌పై అభిమానం చెక్కు చెదరలేదని అన్నారు.

లోకం పోకడ



ఖాళీ కుర్చీలు కనబడకుండా సభకు వచ్చిన కొద్దిమందితో ఇలా మేనేజ్ చేశాం సార్!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	46.7°c	33.1°c
ఆదిలాబాద్	46.6°c	25.6°c
మహబూబ్‌నగర్	46.4°c	33.5°c
రంగారెడ్డి	45.2°c	21.1°c
మెదక్	45.1°c	21.8°c
నిజామాబాద్	44.3°c	25.4°c
హైదరాబాద్	43.1°c	28.4°c
ఖమ్మం	43.0°c	28.0°c
వరంగల్	43.0°c	28.0°c
కరీంనగర్	43.0°c	27.0°c

రాష్ట్రంలో భానుడి భగభగలు

- వడగాలులతో జనం ఉక్కిరిబిక్కిరి
- రానున్న 4 రోజుల్లో 48 డిగ్రీలకు చేరనున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నిప్పుల వర్షం కురుస్తూనే ఉంది. భానుడి భగభగలతో ప్రజలంతా విలవిల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో పాటు వేడి గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. మరో మూడు, నాలుగు రోజులపాటు వాతావరణ పరిస్థితులు ఇలాగే ఉంటాయని, పగటి పూట ఉష్ణోగ్రతలు 45 నుంచి 48 డిగ్రీలకు చేరే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా. శనివారం 58 మండలాల్లో తీవ్ర వడగాలులు,169 మండలాల్లో వడగాలులు వీచినట్టు విపత్తుల సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఏపీ, తెలంగాణలోని పలు జిల్లాల్లో రెడ్ అలర్ట్, మరికొన్ని జిల్లాల్లో ఆరెంజ్ అలర్టులు కొనసాగుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ కారణంగా రాష్ట్రంలో ఏడుగురు మృతిచెందారు.

లాయర్లకు హైకోర్టు ఉపశమనం

- వేసవి తీవ్రత వల్ల విధులకు రాలేకపోతే వ్యతిరేక ఉత్తర్వులు జారీ చేయరాదని ఆదేశం



ఈ తిరుమలాదేవి

నాంపల్లి కోర్టులు, మే 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వేసవి తీవ్రత అధికమవడంతో విధులకు హాజరు కాలేకపోతున్న లాయర్లకు హైకోర్టు ఉపశమనం కల్పించింది. తీవ్రమైన ఎండలు, వడగాడ్పుల వల్ల న్యాయవాదులు గైర్హాజరైనట్టయితే వారి కేసులకు సంబంధించి వ్యతిరేక ఉత్తర్వులు జారీ చేయరాదని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఈ తిరుమలాదేవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నుంచి అమల్లోకి వచ్చే ఈ ఉత్తర్వులను రాష్ట్రంలోని అన్ని కోర్టుల జ్యుడిషియల్ అధికారులు (మేజిస్ట్రేట్లు) పాటించాలని స్పష్టం చేశారు. హైకోర్టు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు వెలువడిన ఈ ఉత్తర్వులను రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లకు పంపినట్టు తిరుమలాదేవి తెలిపారు.

ఒక్కరోజు పోలీస్ కస్టడీకి క్రిశాంక్

- నాంపల్లి కోర్టు ఉత్తర్వులు

నాంపల్లి కోర్టులు, మే 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు, నీటి కొరత కారణంగా ఈ నెల 14 నుంచి వచ్చేనెల 6 వరకు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)లో హాస్టళ్లు, మెస్‌లను మూసివేస్తున్నట్టు సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లను పోస్టు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌ను ఒక రోజుపాటు పోలీస్ కస్టడీకి తరలిస్తూ నాంపల్లిలోని 4వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్‌ను ఆదివారం ఉదయం ఓయూ పోలీసు స్టేషన్‌కు తరలించి సాయంత్రం 5 గంటల్లోగా కోర్టులో హాజరుపర్చాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఆయనను జైలు నుంచి నేరుగా ఉస్మానియా దవాఖానాకు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు పూర్తయ్యాక పోలీస్ స్టేషన్‌కు తరలించనున్నారు.

జనగామలో కల్యాణలక్ష్మి చెక్కు బౌన్స్!

- జీరో కరెంటు బిల్లు రాకపోగా రెండింతలైంది
- కాంగ్రెస్ పాలనలో వచ్చిన మార్పు ఇదేనా?
- పేదలు బతికి బట్టకట్టలేరు!
- గ్యారెంటీలు దక్కలేదని మహిళ ఆవేదన

జనగామ, మే 4 (నమస్తే తెలంగాణ): తులం బంగారం వద్దు.. ఏమొద్దు.. కల్యాణలక్ష్మి కింద కేసీఆర్ ఇచ్చినట్టే లక్షా నూట పదహారు రూపాయలు ఇవ్వండి చాలు.. అని జనగామ జిల్లా కేంద్రానికి చెందిన ఓ నిరుపేద మహిళ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వేడుకొంటున్నది. తన ఇంటికి జీరో కరెంటు బిల్లు రాలేదు. గతంలో రూ.300 నుంచి రూ.500 లోపు బిల్లు వచ్చేది. ఇప్పుడు దాదాపు రూ.900 వస్తున్నదని ఆ మహిళే వాపోయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో మాలాంటి పేదలు బతికి బట్టకట్టే పరిస్థితి లేదంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. కాంగ్రెస్ మార్పు ఇదేనా? ఈ సర్కారులో నిరుపేదల బతుకులకు గ్యారెంటీ లేదా? అంటూ ఆమెతోపాటు పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ ప్రాంతానికి చెందిన మోతె బేబీ అనే మహిళ భర్త ఏడేండ్ల క్రితం చనిపోయారు. అప్పటి నుంచి కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నది. నిరుడు ఆగస్టులో అప్పుచేసి తన కూతురు పెళ్లి చేసింది. కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్ష వస్తే చేసిన అప్పులో కొంత మేరకైనా తీరుతుందన్న ఆశతో ఆ పథకానికి దరఖాస్తు చేసుకున్నది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ఆలస్యంగా జనవరి నెలలో కల్యాణలక్ష్మి చెక్కు వచ్చింది. దాన్ని డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళితే ఖాతాలో డబ్బులు లేవు. వారం తర్వాత రమ్మని అధికారులు తిప్పి పంపించారు. వారం తర్వాత పోతే మళ్లీ అదే సమాధానం చెప్పి పంపించారు. ఆ పేదింటి మహిళ పలుమార్లు బ్యాంకు చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయింది. ఏప్రిల్ 18న మళ్లీ బ్యాంకుకు వెళ్లగా చెక్కు రిజెక్ట్ అయ్యింది. ఒక వారం ఆగి రమ్మని చెప్పారు. మళ్లీ 24న వెళితే చెక్కు మీద రిజెక్ట్ అయిందని స్టాంప్ వేసి పంపించారు. ఇదేమిటని అడిగిన బేబీని ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో నీచెక్కు రిజెక్ట్ అయ్యిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని బాధితురాలు వాపోయింది. ఒకవైపు పెళ్లి కోసం చేసిన అప్పులకు మిత్తి పెరుగుతుండటంతోపాటు ఆర్థికంగా ఎదురవుతున్న ఇబ్బందులను తట్టుకోలేని పరిస్థితితో ఏం చేయాలో తెలియడం లేదని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి చెప్పిన తులం బంగారం ఏమొద్దు.. కేసీఆర్ ఇచ్చినట్టు రూ.లక్షా 116 రూపాలన్న ఇవ్వండి.. అంటూ ఆమె ప్రభుత్వాన్ని వేడుకుంటున్నది. తన ఇంటికి జీరో బిల్లు వచ్చేలా చూడాలని కోరుతున్నది.



బౌన్స్ అయిన కల్యాణలక్ష్మి చెక్కును చూపుతున్న జనగామ జిల్లా కేంద్రం సంజయ్‌నగర్‌కు మోతె బేబీ



బాన్సువాడలో మాజీ స్పీకర్ పోచారం నిర్వహించిన రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన జనం

'డబుల్' బిల్లులు ఇవ్వకుంటే ధర్నా చేస్తా

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ/ బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్, మే 4: బాన్సువాడ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల బిల్లులు లబ్ధిదారులకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలలోపు బిల్లులు రాకపోతే మే 13 ఓటింగ్ తర్వాత తన కుటుంబ సభ్యులు, లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తానని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టాలని పిలుపునిచ్చారు. శనివారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్‌లో జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తో కలిసి రోడ్‌షో, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. బాన్సువాడలో నిర్వహించిన రోడ్డు షో, కార్నర్ మీటింగ్ సందర్భంగా నిర్వహించిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రచారంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోహిత్‌ది ముమ్మాటికీ హత్యే

- నా కొడుకు చావుకు కారకులైన వారికి శిక్షపడే వరకు పోరాడుతా..
- చావుపై విచారణ చేయాలంటే కులాన్ని వెలుగులోకి తెచ్చారు
- మీడియాతో రోహిత్ తల్లి ఆవేదన
- తన కొడుకు హత్యపై విచారణ చేయించాలని సీఎంకు వినతి
- కేసును పునర్విచారణ చేయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ



శనివారం హెచ్‌సీయూ గేటు వద్ద మీడియాతో మాట్లాడుతున్న రోహిత్ వేముల తల్లి రాధిక

హైదరాబాద్/సిటీబ్యూరో, మే 4 (నమస్తే తెలంగాణ)/కొండాపూర్: తన కొడుకు రోహిత్ వేములది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ హత్యేనని ఆయన తల్లి రాధిక వాపోయారు. 'నా కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు. రోహిత్‌ది కచ్చితంగా హత్యే. నా కొడుకును చంపింది అప్పటి వీసీ అప్పారావే. పైకి ఆత్మహత్య అని వాళ్లు అంటున్నారు. హత్య అని నేను అంటున్న దానిపై విచారణ చేయాలి. అప్పుడు దళితుడు అని సోషల్ బాయ్‌కాట్ చేశారు. ఇప్పుడేమో సోషల్ బాయ్‌కాట్ కాదంటున్నారు. నా కొడుకు దళితుడు కాదని అంటున్నారు. దానిపై కూడా విచారణ జరగాలి' అని ఆమె డిమాండ్ చేశారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డిని ఆమె కలిశారు. ఆధారాలు లేవని రోహిత్ కేసును క్లోజ్ చేస్తున్నారని, నిజాయితీగా విచారణ జరిపి బాధ్యులను జైలుకు పంపాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. రోహిత్‌తోపాటు సస్పెండైన విద్యార్థులపై కూడా కేసులు ఎత్తివేయాలని సీఎంకు విన్నవించారు. ఈ సందర్భంగా రోహిత్ వేముల కేసును పునర్విచారణ చేయించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించినట్టు ఆమెకు తెలిపారు. అనంతరం రోహిత్ తల్లి వేముల రాధిక మీడియాతో మాట్లాడుతూ.. 'నా కొడుకును చంపింది వీసీ అప్పారావే. అప్పుడు ఇప్పుడు అదే చెబుతున్నా. ఆ రోజు ఐదుగురు దళిత విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఇప్పుడేమో రోహిత్ వేముల దళితుడు కాదని అంటున్నారు. అది చాలా దుర్మార్గం. నా ఉసురు తప్పకుండా తగులుతుంది' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

నేను ఎస్సీ అయినప్పుడు.. నా కొడుకు కాదా?

'నేను రోహిత్ కన్నతల్లి, దళితురాలిని. నా కడుపున పుట్టిన బిడ్డ దళితుడు కాదా?' అని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. కావాలనే ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ కేసులో రోహిత్ దళితుడు కాదని చెప్పడానికి పోలీసులకు అథారిటీ లేదు. కలెక్టర్, ఎమ్మార్వో దానిని నిర్ధారించాలి. పోలీసులే కోర్టుకు తప్పుడు నివేదికలు ఇచ్చారు. ఇది చెల్లదు' అని ఆమె చెప్పారు. నాటి గుంటూరు కలెక్టర్ కాంతిలాల్ దండే రోహిత్ వేముల 'దళిత్' అని సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. రోహిత్ చాలా మెరిట్ స్టూడెంట్ అని, ఒకవేళ అతనివి ఫేక్ సర్టిఫికెట్లే అయితే.. అవన్నీ బయటపెట్టాలని రాధక డిమాండ్ చేశారు. 'రోహిత్ రెండుసార్లు జేఆర్‌ఎఫ్ క్వాలిఫై అయ్యాడు. ఇప్పటికీ రోహిత్ రిజర్వేషన్‌ను వాడుకోకుండా అన్నీ జనరల్‌లోనే పాసయ్యాడు. జనరల్‌లోనే సీట్లు సంపాదించాడు. మోదీలాంటి ఫేక్ సర్టిఫికెట్లు కావు నా కొడుకువి. అవి నిజమైన సర్టిఫికెట్లు' అని అన్నారు.

వారికి శిక్షపడే వరకు పోరాడుతా

'నా కొడుకు చావుకు కారకులైన వారందరికీ శిక్ష పడే వరకు పోరాడుతా'నని రోహిత్ వేముల తల్లి రాధిక వేముల చెప్పారు. శనివారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద వర్సిటీ విద్యార్థి సంఘాల విద్యార్థులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో కొందరు కులవివక్షకు గురి చేయడంతోనే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, కానీ, పర్సనల్ ప్రాబ్లమ్స్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడంటూ పోలీసులు కేసును క్లోజ్ చేసినట్టు తెలిసిందని వాపోయారు. కొంత మంది పోలీసులు బీజేపీకి అనుకూలంగా విచారణ చేపట్టారని ఆరోపించారు.

బీజేపీ నేతలను కాపాడేందుకే పోలీసుల అత్యుత్సాహం: సీపీఎం

రోహిత్ కేసులో బీజేపీ నేతలను కాపాడేందుకే రాష్ట్ర పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించినట్టు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీజేపీ నేతలు, హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్‌పై ఉన్న కేసులను ఎత్తివేయించడానికే పోలీసులు రోహిత్ వేముల కులంపై కలెక్టర్ తన నిర్ణయాన్ని ప్రకటించకముందే హడావుడిగా నివేదికను హైకోర్టుకు సమర్పించినట్టు పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా కేసు మూసివేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించిన నేపథ్యంలో, ఈ కేసును పునర్విచారణ చేపడుతున్నట్టు డీజీపీ ప్రకటించడాన్న తమ పార్టీ స్వాగతిస్తున్నదని తెలిపారు.

బీజేపీ సూచనతోనే కేసు ముగింపు: విద్యార్థి నాయకులు

'మా స్నేహితుడి చావుకు ఎవరు బాధ్యత వహిస్తారు? దోషులను ఎవ్వరు శిక్షిస్తారు? సరైన ఆధారాలు చూపకుండా కేసును ఎలా ముగిస్తారు?' అంటూ రోహిత్ వేముల స్నేహితులు గళమెత్తారు. సైబరాబాద్ పోలీసులు కేసు ముగిసిందని వెల్లడించడంపై వాళ్లంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోహిత్ చావుకు కొందరు కారణం కాదని చెప్పడానికి పోలీసులు ఎవ్వరూ?' అంటూ సెంట్రల్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి సీహెచ్ శేషయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు తుది నివేదిక సమర్పించినప్పుడు తమకు ఎలాంటి నివేదిక అందజేయలేదని ప్రధాన ఫిర్యాదుదారుడు సుంకన్న వేల్పుల ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టును కూడా ఆశ్రయించకుండా తమకు న్యాయం నిరాకరిస్తే ఎలా అని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకుల సూచనల మేరకే ఈ కేసును పోలీసులు ముగించారని ఆరోపించారు. రోహిత్ కులంపై కొందరు చర్చలు పెట్టి అవమానిస్తున్నారని జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ పీ విజయ్‌కుమార్ చెప్పారు. రోహిత్ వేములకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు తెలిపారు.

బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడంతోనే రైతుబంధు రివర్స్

హైదరాబాద్, మే 4(నమస్తే తెలంగాణ): కొంత మంది రైతుల బ్యాంకు ఖాతాల వివరాలు సరిగా లేకపోవడంతోనే రైతు బంధు డబ్బులు తిరిగి వెనక్కి వచ్చాయని వ్యవసాయ శాఖ తెలిపింది. ఈ నెల 1న నమస్తే తెలంగాణ పత్రికలో 'రైతు బంధు రివర్స్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ స్పందించింది. 'మూసేసిన బ్యాంకు ఖాతాలు, స్తంభించిన ఖాతాల కారణంగానే రైతుబంధు నిధులు తిరిగి వెనక్కి వచ్చాయి. ఇలా ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంటుంది. కాబట్టి సరైన ఖాతా వివరాలను సేకరిస్తున్నాం. ఇది పూర్తికాగానే తిరిగి రైతు బంధు డబ్బులు జమచేస్తాం' అని వ్యవసాయ శాఖ పేర్కొంది.

కాంగ్రెస్‌కు బీసీ(ఏ) కులాలు ఓటేయొద్దు

- రజక సంఘం, బీసీ(ఏ) కులాల నేతల నిరసన

రవీంద్రభారతి, మే4: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీసీ(ఏ) జాబితాలోని 57 కులాలకు చెందిన ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటేయొద్దని తెలంగాణ రజక సంఘం, బీసీ(ఏ) జాబితాలోని 57 కులాల నేతలు పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. నారాయణపేట, సిద్దిపేట ఎన్నికల సభ ల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ(డీ) జాబితాలో ఉన్న ముదిరాజ్‌లను బీసీ (ఏ) జాబితాలో కలుపుతామని ప్రకటించడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. ఈ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నప్పటికీ సీఎం దీనిపై హామీ ఇవ్వడం ఎన్నికల నియమావళిని ధిక్కరించడమే అవుతుందని, తక్షణమే ఎన్నికల కమిషన్ ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బీసీ(ఏ) జాబితా కులాలకు క్షమపణ చెప్పాలని, లేకుంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ(ఏ) కులాల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ నరహరి, ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింహులు, తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల సంపత్, ప్రొఫెసర్ బాగయ్య, చాకలి ఐలమ్మ శ్వేతలు, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప నరహరి, తెలంగాణ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజన్న, రజక వ్యాపార సంఘం రాష్ట్ర కన్వీనర్ పీ నర్సింహ, రాములు పాల్గొన్నారు.

రైతుకు రేవంత్ మరో వాయిదా!

మొదటిపేజీ తరువాయి...

చూస్తున్నవా ఇది ప్రజల మాట అని కేసీఆర్ సాక్ష్యం చూపిస్తున్నారు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక ముఖ్యమంత్రి రైతుకు మరో వాయిదా పెట్టారు. ఈ నెల 8లోపు రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు రైతుబంధు బకాయిలు చెల్లిస్తామని ప్రకటించారు. ఈ మేరకు శనివారం కొత్తగూడెంలో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం రైతుభరోసా వేస్తలేదని కేసీఆర్ మాట్లాడుతున్నడు. మొత్తం 69 లక్షల మంది రైతులుంటే ఇప్పటికే 65 లక్షల మందికి రైతుభరోసా అందించాం. ఇక మిగిలింది 4 లక్షల మంది రైతులే. ఈ నెల 8 లోపు చివరి రైతు వరకు రైతుభరోసా బకాయిలు చెల్లించే బాధ్యత మాది. 150 రోజులు తిరిగే లోపలే రూ.7,500 కోట్ల రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తున్నాం. కానీ, కేసీఆర్ దిగిపోయిండు.. రైతుభరోసా అగిపోయిందని కేసీఆర్ దుష్ప్రచారం చేస్తున్నారు. మే 9 నాడు అమరవీరుల స్థూపం ముందు చర్చ పెడుదాం వస్తవా? రాష్ట్రంలో ఈ నెల 9లోపు ఏ ఒక్క రైతుకైనా బకాయి ఉంటే అమరుల స్థూపం ముందు ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్తా. ఒకవేళ రైతులందరికీ రైతుభరోసా అందితే నీ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్తవా చంద్రశేఖర్‌రావు?' అని అన్నారు.

కేసీఆర్ ప్రశ్నలు.. రేవంత్‌లో ఫ్రస్ట్రేషన్

రైతుబంధుపై కేసీఆర్ ప్రశ్నలతో సీఎం రేవంత్‌రెడ్డిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు కొత్తగూడెం సభలో కేసీఆర్‌పై తిట్ల దండకమే కారణం. తాజా ప్రకటనతో రైతు బంధు అందరికీ వేయలేదని సీఎం రేవంత్ రెడ్డే స్వయంగా అంగీకరించారు. అలాంటప్పుడు ఫలానా తేదీన అందరికీ రైతుబంధు అందిస్తామని చెప్తే సరిపోతుంది. కానీ కేసీఆర్ వల్లే రైతుబంధు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న కోపంలో రేవంత్‌రెడ్డి ఉన్నట్టు కనిపించింది. అందుకే కేసీఆర్‌ను తనకు అచ్చొచ్చిన భాషలో తిట్టి.. ఆ తర్వాత ఈ నెల 8న రైతు బంధు ఇస్తామని ప్రకటించారు. అయితే సీఎం కోపానికి, ఫ్రస్ట్రేషన్‌కు కారణం లేకపోలేదు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన రోడ్‌షోల్లో రైతుబంధు రాకపోవటంపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పంట వేసుకునే సమయంలో ఇవ్వాల్సిన రైతుబంధు.. కోతలు పూర్తవుతున్నా ఇవ్వటం లేదంటూ నిలదీస్తున్నారు. ఇంకెప్పుడు రైతుబంధు ఇస్తారు? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతి రోడ్‌షోలోనూ ఇదే పరిస్థితి. ఇలా కేసీఆర్ ప్రశ్నల దాడి.. రైతుల నుంచి స్పందనతో సీఎం రేవంత్‌రెడ్డిలో ఫ్రస్ట్రేషన్ పెరిగిపోయినట్టు ఉన్నదనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ ఫ్రస్ట్రేషన్‌ను తగ్గించుకునేందుకే కేసీఆర్‌ను తిట్టారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. 'రైతుబంధు వేస్తలేరని కేసీఆర్ మాట్లాడుతున్నడు.. ఓరి సన్నాసోడా, సోయి లేనోడా, చవట, దద్దమ్మ, దిక్కుమాలినోడా, దివాణాగా' అంటూ కేసీఆర్‌పై పరుష వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రశ్నిస్తున్నారు కాబట్టే రేవంత్‌రెడ్డి స్పందించారని, లేకుంటే ఎప్పటికీ స్పందించేవారు కారేమోనని రైతులు అంటున్నారు.

రైతు అవసరం కన్నా ఓట్లే ముఖ్యం

సరిగ్గా ఎన్నికల తేదీ సమీపించగానే రైతుబంధు, పంటనష్ట పరిహారం ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వం వీటి అమలు ఆలస్యం చేసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మే 13న పోలింగ్ జరగనున్నది. సరిగ్గా ఎన్నికల తేదీకి ముందు రైతుబంధు, పంట పరిహారం అందించి లబ్ధి పొందాలనే దురుద్దేశం కాంగ్రెస్‌కు ఉన్నదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఉద్దేశమే లేకుంటే.. ఎప్పుడో డిసెంబర్ 9న ప్రారంభించిన రైతుబంధు పంపిణీ నాలుగున్నర నెలలుగా పూర్తి చేయకుండా సరిగ్గా ఈ నెల 8నే పూర్తి చేస్తామనటం ఏమిటన్న సందేహాలకు తావిస్తున్నది. మార్చిలో జరిగిన పంట నష్టానికి పరిహారం ఇచ్చేందుకు ఎన్నికల సంఘం పది రోజుల క్రితమే అనుమతి ఇచ్చింది. కానీ, ప్రభుత్వం వచ్చే 3-4 రోజుల్లో పంపిణీకి చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి రైతుల ప్రయోజనాల కన్నా, ఎన్నికల ప్రయోజనాలే ముఖ్యమయ్యాయా? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

8లోగానైనా రైతుబంధు పడేనా?

రైతుబంధు ఇవ్వటంపై సీఎం రేవంత్‌రెడ్డి రోజుకో మాట మార్చుతున్నారు. అలవోకగా తేదీలు, గడువులను మార్చేస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు గడువు మార్చేశారు. డిసెంబర్‌లోపు పూర్తి చేస్తామని ఓసారి, ఫిబ్రవరి లోపు అని మరోసారి, మార్చి 15 నాటికి అని ఇంకోసారి, మార్చి 31 నాటికి అంటూ చివరి గడువు చెప్పారు. ఈ గడువులన్నీ పోయాయి తప్ప, రైతులకు రైతుబంధు మాత్రం రాలేదు. ఇక తాజాగా కేసీఆర్ ఒత్తిడితో ఈ నెల 8 నాటికి ప్రతి రైతుకు రైతుబంధు ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మాటలపై రైతులకు నమ్మకం కలగటం లేదు. ఇప్పటికే అనేకసార్లు గడువు పెట్టి.. తప్పారని, ఈ గడువుపైనా నమ్మకం లేదని అంటున్నారు.

కాదని నిరూపిస్తే రాజీనామా చేస్తా

మొదటిపేజీ తరువాయి...

చేసి రైతులను అప్పుల పాలు చేసినందుకు రేవంత్ ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. 'రైతుబంధు నువ్వు ఇచ్చేదేంది? అది రైతుల హక్కు.. నువ్వేదో పెద్ద దానం ఇచ్చినట్టు పోజులు కొడుతున్నావ్.. కేసీఆర్‌ను చాలెంజ్ చేస్తున్నావ్. మోదీ నల్ల చట్టాలు తెచ్చి చెంపలు వేసుకున్నట్టే.. నువ్వు కూడా రైతులందరికి రైతుభరోసా ఇచ్చి పాప ప్రక్షాళన చేసుకోవాలి. స్వయానా మీ వ్యవసాయ శాఖ మంత్రే రైతుబంధు రాలేదని చెప్పిన తరువాత ప్రజల్లో పలుచనై తప్పించుకునే పరిస్థితి లేదని గ్రహించి ఇవాళ ఇస్తామంటున్నారు' అని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మరో మంత్రి రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానంటాడని, ఈ నెల 13న చెప్పులతో బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పటికీ కాంగ్రెస్ గ్రాఫ్ 10 శాతానికిపైగా పడిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి మందలింపులు, ప్రజల నుంచి ఈసడింపులు వస్తున్నాయన్న భయంతోనో రెండు రోజులుగా కొంత మారినట్టు కనిపిస్తున్నా.. రేవంత్ అబద్ధాలకు అడ్డూఅదుపు ఉండదన్నారు. 65 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చినట్టు చెప్తున్న రేవంత్‌రెడ్డి ఒక్కరంటే ఒక్కరికి ఇచ్చినట్టు నిరూపిస్తే ముక్కు నేలకు రాసి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి రైతుభరోసా ప్రారంభించ లేదు.. కేవలం రైతుబంధును కొనసాగించారని స్పష్టంచేశారు. అదీ అప్పుడే కేసీఆర్ రూ.500 కోట్లు సిద్ధం చేస్తే రైతాంగానికి ఇవ్వకుండా అడ్డుపడి అధికారంలోకి వచ్చాక వాటిని కాంట్రాక్టర్లకు పంచారని విమర్శించారు.



జీ వంశీకృష్ణ ఎంపీ అని ఉన్న ఫేస్‌బుక్ పేజీ (ఫైల్)



జీ వంశీకృష్ణ ఎఫ్‌సీగా మారిన తాజా ఫేస్‌బుక్ పేజీ

ఈసీ నోటీస్.. వంశీ ఎఫ్‌బీలో చేంజెస్

- ఎంపీ స్థానంలో ఎఫ్‌సీగా మార్పు
- 'ఎన్నిక కాకముందే ఎంపీ'పై స్పందన
- 'నమస్తే' ఎఫెక్ట్‌తో మారిన పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ ఫేస్‌బుక్ అకౌంట్

నమస్తే ఎఫెక్ట్

పెద్దపల్లి, మే 4 (నమస్తే తెలంగాణ): ఎన్నిక కాక ముందే సోషల్ మీడియాలో ఎంపీగా చెలామణి అవుతున్న పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకి చుక్కెదురైంది. దీనిపై ఏప్రిల్ 27న 'ఎన్నిక కాకముందే ఎంపీ' శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో నెటిజన్ల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈసీకి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులందాయి. దీంతో ఎన్నికల అధికారులు కోడ్ ఉల్లంఘనగా పరిగణించి నోటీసులు జారీ చేయగా.. వంశీకృష్ణ ఫేస్‌బుక్ అకౌంట్‌ను మార్చేశారు. ఎంపీ స్థానంలో జీ వంశీకృష్ణ ఎఫ్‌సీ(ఫ్యాన్స్ క్లబ్)గా మార్చారు. అలాగే డీపీ, కవర్ పేజీలలో కేవలం వంశీకృష్ణ ఉన్న ఫొటోలనే ఉంచారు.

జొన్నలు తక్కువకు అమ్ముకోవద్దు: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ) : జొన్నలు తక్కువ ధరకు అమ్ముకోవద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జొన్న రైతులకు సూచించారు. అదిలాబాద్, నిర్మల్ జిల్లాల జొన్న రైతుల విజ్ఞప్తి మేరకు, సంబంధిత జిల్లా అధికారుల నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఎకరాకు 8.85 నుంచి 12 క్వింటాళ్ల వరకు పరిమితి పెంచుతుందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా ఇప్పటికే క్వింటాల్‌కు రూ.3180 మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామన్నారు.

49 ఏండ్లలోపు వారే 71% ఓటర్లు

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 49 ఏండ్ల లోపు వయసున్న వారే 71 శాతం మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల కమిషన్ అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణలో 30-39 సంవత్సరాల వయసున్న వారు అత్యధికంగా 91 లక్షల మంది ఓటర్లు ఉండటం విశేషం. 18, 19 సంవత్సరాల వయసున్న కొత్త ఓటర్లు 9.20 లక్షల మంది ఉన్నారు. రాష్ట్రంలో తుది ఓటర్ల జాబితా ప్రకారం 3,32,16,348 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,65,28,366, మహిళలు 1,67,01,192, థర్డ్ జెండర్ వారు 2,760 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళలు 1.72 లక్షల మంది అధికంగా ఉన్నారు. దివ్యాంగులు 5,27,486 ఓటర్లు ఉన్నారు. వీరి కోసం రాష్ట్రవ్యాప్తంగా 35,809 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

చట్టసభల్లో బీసీలకు 50% సీట్లు ఇవ్వాలి:ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మే4 (నమస్తే తెలంగాణ): బీజేపీ రిజర్వేషన్ల వ్యతిరేకి అనే ముద్ర పోవాలంటే బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వెంటనే ప్రకటించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి శనివారం ప్రత్యేకంగా లేఖ రాశారు. బీసీ రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు ఎత్తివేస్తారనే చర్చ దేశవ్యాప్తంగా కొనసాగుతున్నదని, ప్రత్యేకంగా కాంగ్రెస్, ఎస్పీ, ఆర్జేడీ, డీఎంకే, వామపక్ష పార్టీలు బలంగా వాదిస్తున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి వెంటనే స్పందించి బీసీలకు చట్టసభలలో 50శాతం రిజర్వేషన్లు పెడతామని, బీసీ కులగణన చేస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

బతుకు 'సాగ'క..'ఉపాధి' బాట

- సాగునీరందక.. పంటలు ఎండి కూలివైపు..
- మూడేండ్లలో ఏప్రిల్‌లోనే అత్యధిక పనిదినాలు
- ఒక్కరోజే 18లక్షల మంది కూలీల హాజరు



ఏప్రిల్ లక్ష్యం : **2.25** కోట్ల పనిదినాలు

జరిగిన పనులు : **3.26** కోట్ల పనిదినాలు

అంటే కోటి పనిదినాలు పెరిగినయ్

రాష్ట్రవ్యాప్తంగా ఒక్క శుక్రవారమే పనికి వచ్చిన కూలీల సంఖ్య **18.18** లక్షలు

రాష్ట్రానికి ఈ ఆర్థిక సంవత్సరం 8కోట్ల పనిదినాలను కేంద్రం కేటాయిస్తే ఇప్పటికే **3.26** కోట్ల పనిదినాలు పూర్తయ్యాయి.

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ) : కరువు ప్రభావం గ్రామాలపై తీవ్రంగా పడింది. సాగునీరందక కండ్లెదుటే పంటలు ఎండిపోవడంతో చేసేది లేక కూలీలతో పాటు రైతులు సైతం ఉపాధి హామీ పనులకు పోవాల్సి వస్తున్నది. మూడేండ్లలోనే గత ఏప్రిల్‌లో అత్యధిక కూలీలు ఉపాధి పనులకు రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. యాసంగి పంటలు అంతంతే పండడం, సరైన పనులు దొరక్కపోవడంతో కూలీలకు, రైతులకు ఉపాధి పనులే దిక్కవుతున్నాయి. ఏప్రిల్ లక్ష్యం 2.25 కోట్ల పనిదినాలైతే అదే నెలలో 3.26కోట్ల పనిదినాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంచనాలకు మించి మరో కోటి పనిదినాలు పెరగడం అధికారులను సైతం విస్మయానికి గురిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క శుక్రవారమే 18.18 లక్షల మంది కూలీలు పనికి రాగా, ముున్ముందు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రం ఈ ఆర్థిక సంవత్సరం 8కోట్ల పని దినాలు కేటాయించిందని, ఏప్రిల్ నాటికే 3.26కోట్ల పనిదినాలు పూర్తయ్యాయని, జూన్ మధ్యకల్లా మొత్తం పూర్తవుతాయని భావిస్తున్నారు. ఎక్కువ మంది కూలీలు పనులకు వస్తుండటంతో మస్టర్లను ఎప్పటికప్పుడు పూర్తి చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. దీని ద్వారావెంటనే కూలి మొత్తం వారి అకౌంట్లలో జమవుతుందని చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టును పక్కకు పెట్టి సాగునీరు అందించకపోవడంతో ఇక నీళ్లు వస్తాయో రావోనన్న అనుమానంతో రైతులు లక్షల ఎకరాల్లో పంటలు వేయలేదు. వేసిన చోట నీళ్లందక పంటలు ఎండిపోయాయి. దీంతో వ్యవసాయ, అనుబంధ పనులు తగ్గిపోయి ఆ ప్రభావం వ్యవసాయ కూలీలపై పడింది. మార్చి వరకు ఇతర పంటల పనులు చేసినా అవన్నీ పూర్తి కావడంతో ఏప్రిల్ నుంచి ఉపాధి హామీ వైపు మళ్లారు. దీనికి తోడు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ప్రతి గ్రామంలో జాబ్ కార్డుల ఆధారంగా లక్ష్యాన్ని నిర్దేశించి కూలీలకు పనులు చూపాలని ఆదేశించారు. పెద్ద సంఖ్యలో కూలీలు ఉదయాన్నే పనులకుపోతుండటంతో గ్రామాలు బోసిపోతున్నాయి. ఉపాధి హామీ పనులు జరిగే చోటుకే లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం అభ్యర్థులు వెళ్తున్నారు. పల్లెల్లో వ్యవసాయం ఎంతగా దెబ్బతిన్నదో ఈ దుస్థితిని చూస్తే తెలుస్తుందని పలు రాజకీయ పార్టీల నేతలు చెబుతున్నారు.

మూడేళ్ల ఏప్రిల్ నెల పనిదినాల వివరాలు

సంవత్సరం	నెల	పనిదినాలు (కోట్లలో)
2024	ఏప్రిల్	3.26
2023	ఏప్రిల్	2.26
2022	ఏప్రిల్	2.89

దవాఖానల్లో పనిచేయని ఏసీలు

- ఎంజీఎం పీడియాట్రిక్ కేర్ యూనిట్‌లో ఉక్కపోత
- ఫ్యాన్ల గాలి సరిపోక ఉక్కపోతతో పసికందుల ఉక్కిరిబిక్కిరి
- మార్చురీల్లో ఏసీలు పనిచేయక కుళ్లికంపుగొడుతున్న మృతదేహాలు
- పోస్టుమార్టం చేసేందుకు జంకుతున్న వైద్యులు

పోచమ్మమైదాన్, మే 4: ఓ పక్క భరించలేని ఎండ వేడిమి.. మరోపక్క వరంగల్ ఎంజీఎం దవాఖానలో ఏసీలు పనిచేయక.. పీడియాట్రిక్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్న శిశువులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎంజీఎంలోని పీడియాట్రిక్ యూనిట్ ఐసీయూ/హెచ్‌డీయూ వార్డుల్లో నెలలు నిండని పసికందులకు చికిత్స అందిస్తారు. వీరి కోసం రెండు వార్డుల్లో ఎనిమిది ఏసీలు అమర్చినప్పటికీ అవి పనిచేయడం లేదు. ఫ్యాన్ల నుంచి వచ్చే వేడిగాలి, ఉక్కపోత భరించలేక శిశువులు తల్లిడిల్లిపోతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఎంతో దూరం నుంచి చిన్నారులను దవాఖానకు తీసుకొస్తే.. ఇక్కడ సరైన వసతులు లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఎంజీఎం ఆవరణతోపాటు పలు వార్డుల్లో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదు. మార్చురీలోని ఏసీలు రెండు నెలలకు పైగా పనిచేయక మృతదేహాలు కంపుకొడుతున్నాయి. దీంతో మృతదేహాలకు పోస్టుమార్టం చేయడానికి వైద్యులు జంకుతున్నారు. ఇక్కడి సిబ్బంది సైతం అల్లాడిపోతున్నారు. శవాల నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని చుట్టుపక్కల వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ దవాఖాన రెండో అంతస్తులో ఉన్న పల్మనాలజీ విభాగంలోని శుక్రవారం ఏసీలు పనిచేయ లేదు. ఉన్నతాధికారులు వాటికి మరమ్మతులు చేయించడం విస్మరించారు. మరో వైపు ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో రోగులు ఉక్కపోతకు తట్టుకోలేకపోతున్నారు. చేసేదిలేక కొందరు రోగులు ఇంటి నుంచి కూలర్లను తెచ్చుకొని ఉక్కపోత నుంచి ఉపశమనం పొందుతున్నారు. అయినా.. దవాఖాన అధికారులు చర్యలు తీసుకోవడం లేదని రోగులు, బంధువులు విమర్శలు గుప్పిస్తున్నారు.

బీజేపీకి కర్రుకాల్చి వాత పెట్టాలి

- పాలమూరుకు జాతీయ హోదా ఏదీ?
- నా అరెస్టుకు బీజేపీ అగ్రనేతల కుట్ర
- కొత్తకోట, కొత్తగూడెంలో రేవంత్‌రెడ్డి

వనపర్తి/భద్రాద్రి కొత్తగూడెం, మే 4 (నమస్తే తెలంగాణ): కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉండి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వని బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు కర్రు కాల్చి వాత పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలో బహిరంగ సభ, వనపర్తి జిల్లా కొత్తకోటలో రోడ్డుషోలో ప్రసంగించారు. రిజర్వేషన్ల రద్దుపై మాట్లాడినందుకు మోదీ, అమిత్‌షాలు కుట్ర చేసి తనను అరెస్ట్ చేయాలని చూస్తున్నారని తెలిపారు. 70 ఏండ్ల తర్వాత పాలమూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి అయిన రెండో వ్యక్తిగా తనకు అవకాశం వచ్చిందని చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి జరగాలంటే వంశీచంద్‌రెడ్డి, మల్లు రవిని ఎంపీలుగా గెలిపించాలని కోరారు. ఇక ఖమ్మం ప్రజలు చైతన్యవంతులని, దేశంలో అత్యధిక మెజార్టీతో ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఏబీసీడీ వర్గీకరణ, ముదిరాజ్, వాల్మీకుల రిజర్వేషన్ల సమస్యలు సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నాయని, వాటన్నింటినీ పరిష్కరించాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపించాలని చెప్పారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని కొత్తకోటలో కురుమూర్తి స్వామిపై ప్రమాణం చేశారు. కొత్తకోటలో స్థానిక ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి తన నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొత్తగూడెంలో జరిగిన సభలో ఎండకు తట్టుకోలేక ప్రజలు మధ్యలోనే ఇంటిముఖం పట్టారు. ఇది గమనించిన నాయకత్వం స్టేడియం మెయిన్ గేట్ ను బంద్ చేశారు. కార్యక్రమాల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, కూనంనేని సాంబశివరావు, ఆదినారాయణ, రాగమయి, తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, సీపీఐ, సీపీఎం, ఎన్డీ నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న మందకృష్ణ మాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి తదితరులు


కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలి

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు
- రేవంత్‌రెడ్డితో మాదిగలకు అన్యాయం: మోత్కుపల్లి
- ధర్నాచౌక్‌లో మాదిగల మహా ధర్నా

కవాడిగూడ, మే 4: మాదిగలు, నేతకాని, బీసీలంతా ఏకమై ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలోనే మాదిగలకు తీరని అన్యాయం జరిగిందని, ఏ ఒక్క మాదిగ బిడ్డ కూడా ఆ పార్టీకి ఓటేయొద్దని హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ అవమానించడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ తదితరులు హాజరయ్యారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ జైపూర్ నియమావళికి విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ఓ సామాజికవర్గంతో కుమ్మక్కై ఒకే కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ సీట్లు కేటాయించారని, 80 శాతం ఉన్న మాదిగలకు మాత్రం ఒక్క సీటు కూడా కేటాయించలేదని ధ్వజమెత్తారు.

కన్నీరు పెట్టుకున్న మోత్కుపల్లి

సీఎం రేవంత్‌రెడ్డి వైఖరితో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కన్నీటి పర్యంతమయ్యారు. చరిత్రలో ఏ పార్టీ చేయని అన్యాయం కాంగ్రెస్ పార్టీ చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, కంటోన్మెంట్ బీజేపీ అభ్యర్థి వంశీ తిలక్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రాగటి సత్యం, తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ, సూరన్న మాదిగ, గోపాల్, నరసింహ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



టాప్ ప్లేస్‌లో పోటీకి రాయ్‌బరేలీలో నెగ్గండి!

- రాహుల్‌కు కాస్పరోవ్ సూచన
- జోక్ చేశానని ఆ తర్వాత క్లారిటీ

న్యూఢిల్లీ, మే 4: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల మాజీ వరల్డ్ చెస్ చాంపియన్ గ్యారీ కాస్పరోవ్ స్పష్టత ఇచ్చారు. రాహుల్‌పై తాను జోక్ చేసినట్టు వెల్లడించారు. తాను చేసిన సూచనను సీరియస్‌గా తీసుకోవద్దని అన్నారు. రాజకీయాలు, చెస్ అంటే తనకిష్టమని ఇటీవల రాహుల్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కాస్పరోవ్ తన ఫేవరెట్ చెస్ క్రీడాకారుడని చెప్పారు. ఆ కామెంట్స్‌పై కాస్పరోవ్ స్పందిస్తూ.. టాప్ ప్లేస్‌లో పోటీ పడాలంటే ముందుగా రాయ్‌బరేలీలో నెగ్గాలంటూ రియాక్ట్ అయ్యారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావటంతో, తన వ్యాఖ్యలపై మరింత వివరణ ఇచ్చేందుకు ఆయన ప్రయత్నించారు. తన వ్యాఖ్యల్ని సీరియస్‌గా తీసుకోవద్దని ఆయన అన్నారు.



హస్తం పార్టీ 'హిట్ వికెట్'!

- పోలింగ్‌కు ముందే చేతులెత్తేస్తున్న అభ్యర్థులు
- నామినేషన్ల ఉపసంహరణ.. టికెట్ తిరస్కరణ
- మొన్న సూరత్.. నిన్న ఇండోర్.. నేడు పూరీ
- బీజేపీకి బలంగా మారుతున్న కాంగ్రెస్ బలహీనత
- కాంగ్రెస్ అభ్యర్థులకు కండువా కప్పుతున్న బీజేపీ
- కాంగ్రెస్‌ది నైరాశ్యం.. బీజేపీది అనైతికం: విశ్లేషకులు

పూరీ, మే 4: టికెట్ కోసం దరఖాస్తులు.. అధిష్ఠానానికి వేడుకోలు.. టికెట్ ఇవ్వకపోతే పార్టీ ఆఫీసుల ముందు ఆందోళనలు. ప్రతి ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో కనిపించే సీన్ ఇది. కానీ, ఇప్పుడు ఇదంతా గతం. ఇప్పుడు టికెట్ ఇచ్చినా 'మేము పోటీ చేయలేం బాబోయ్' అంటూ ఆ పార్టీ అభ్యర్థులు తిరస్కరిస్తున్నారు! నామినేషన్‌ను సైతం ఉపసంహరించుకొని పోలింగ్‌కు ముందే చేతులెత్తేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలో చేరిపోతున్నారు. మొన్న సూరత్‌లో, తర్వాత ఇండోర్‌లో, ఇప్పుడు పూరిలో జరిగిందిదే. మోదీని గద్దె దింపుతామని ఆ పార్టీ చెప్పుకుంటున్నా అందుకు తగ్గ పోరాటస్ఫూర్తి మాత్రం ఆ పార్టీ అభ్యర్థుల్లో నింపలేకపోతున్నది. మనం గెలుస్తున్నామనే నమ్మకాన్ని కలిగించలేకపోతున్నది. ఫలితంగా సార్వత్రిక ఎన్నికల వేళ ఎన్నడూ చూడని దయనీయ స్థితిని కాంగ్రెస్ ఎదుర్కొంటున్నది. మరోవైపు కాంగ్రెస్ బలహీనతలనే బీజేపీ బలంగా మార్చుకుంటున్నది. కాంగ్రెస్ అభ్యర్థులకు వల వేసి కాషాయ కండువా కప్పేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఏకగ్రీవాలకు తెర లేపింది. ఈ పరిస్థితులు చూస్తున్న రాజకీయ విశ్లేషకులు.. కాంగ్రెస్‌ది నైరాశ్యమని, బీజేపీది అనైతిక రాజకీయమని విమర్శిస్తున్నారు.

పైసలు లేవు.. పోటీ చేయలేను

ఒడిశాలోని పూరీ అభ్యర్థిగా మాజీ జర్నలిస్టు సుచరితా మొహంతీని కాంగ్రెస్ ప్రకటించింది. అయితే, తాను పోటీ చేయనని, టికెట్‌ను తిరస్కరించారు. 'నా దగ్గర ఉన్న డబ్బును ఖర్చు చేసేశా. ఆర్థిక సహకారం అందించేందుకు పార్టీ అధిష్ఠానం నిరాకరించింది. ఈ పరిస్థితుల్లో పోటీ చేయలేను' అని ఆమె ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు లేఖ రాశారు.



సుచరితా మొహంతీ | అక్షయ్ కాంతి బామ్ | నిలేశ్ కంభానీ

అహ్మదాబాద్.. సూరత్.. ఇండోర్

ముందుగా అహ్మదాబాద్ ఈస్ట్ స్థానానికి అభ్యర్థిగా రోహన్ గుప్తాను కాంగ్రెస్ ఖరారు చేయగా ఆయన పార్టీకి గుడ్‌బై చెప్పి బీజేపీలో చేరిపోయారు. ఆ తర్వాత సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ కుంభానీ నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఆయన బీజేపీతో ఒప్పందంలో భాగంగానే నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా చేసుకున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. తర్వాత ఇండోర్‌లో అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ నామినేషన్ ఉపసంహరించుకొని బీజేపీ నేతలతో ఫొటోలకు ఫోజులిచ్చారు. దీంతో ఈ రెండు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను నిలబెట్టలేకపోయింది.

కాంగ్రెస్‌ది బలహీనతే

ఈసారి అధికారం తమదేనని కాంగ్రెస్ పెద్దలు చెప్తున్న మాటలు ఆ పార్టీ అభ్యర్థుల్లోనే నమ్మకాన్ని కల్పించలేకపోతున్నాయి. అభ్యర్థుల్లో గెలుపుపై నమ్మకాన్ని, పోరాట స్ఫూర్తిని కలిగించడంలో కాంగ్రెస్ హైకమాండ్ విఫలమవుతున్నదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టికెట్ తిరస్కరించే వారికి, నామినేషన్లు ఉపసంహరించుకునే వారికి, బీజేపీతో టచ్‌లో ఉన్న వారికి టికెట్లు ఇస్తున్నదంటే కాంగ్రెస్ ఎంత దయనీయ స్థితిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చని చెప్తున్నారు.

బీజేపీది అనైతిక రాజకీయం

నామినేషన్లు ఉపసంహరించుకొనేలా చేస్తున్నారంటే ముందు నుంచే వారితో బీజేపీ సంప్రదింపులు జరుపుతూ ఉండొచ్చనే అనుమానాలను విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. మూడోసారి 370 సీట్లతో అధికారంలోకి వస్తామని చెప్తున్న బీజేపీ.. ఆ నమ్మకం ఉంటే ఎందుకు ఇలా అనైతిక రాజకీయాలకు పాల్పడుతున్నదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పూరీలో అభ్యర్థిని మార్చాం: కాంగ్రెస్

ఒడిశాలోని పూరీ లోక్‌సభ స్థానంలో పోటీ నుంచి తప్పుకొంటున్నట్టు సుచరితా మొహంతీ ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ నష్ట నివారణ చర్యలకు దిగింది. పార్టీ నుంచి ఆర్థిక సహకారం లేదన్న ఆమె ఆరోపణలను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం ఖండించారు. పూరీలో అభ్యర్థిని ఇప్పటికే మార్పు చేశామని, అయితే రేసు నుంచి సుచరిత తప్పుకోవడంతో ఈ నిర్ణయం తీసుకోలేదని, అభ్యర్థి మార్పు అనేది పార్టీ వ్యూహంలో ఒక భాగమని తెలిపారు. పూరీలో కొత్త అభ్యర్థిని అతి త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

23 దేశాలు.. 75 మంది ప్రతినిధులు

న్యూఢిల్లీ, మే 4: ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు 23 దేశాలకు చెందిన ఎన్నికల సంఘాల ప్రతినిధులు మన దేశానికి విచ్చేశారు. రష్యా, ఆస్ట్రేలియా, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులు చిన్న చిన్న బృందాలుగా గోవా, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్‌ల్లోని వివిధ నియోజకవర్గాలలో జరిగే ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ సరళి, అమలవుతున్న సాంకేతికత తదితరమైనవి పరిశీలిస్తారు. ఇలా విదేశీయులు సందర్శించడం ఇదే తొలిసారి.

బీజేపీ గుర్తింపును సస్పెండ్ చేయాలి: జేఎంఎం

రాంచీ: బీజేపీకి ఇచ్చిన జాతీయ పార్టీ గుర్తింపును సస్పెండ్ చేయాలని జేఎంఎం ఎన్నికల కమిషన్‌ను శనివారం డిమాండ్ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో అమర్యాద భాషను ఉపయోగిస్తున్నందువల్ల ఈ చర్య తీసుకోవాలని కోరింది. మోదీ బీజేపీ స్టార్ క్యాంపెయినర్ అని, ఆయన ప్రసంగాల్లో మతాన్ని ప్రస్తావిస్తున్నారని తెలిపింది. ఇది నిబంధనలకు విరుద్ధమని, మతం, వర్గాలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయకుండా బీజేపీ స్టార్ క్యాంపెయినర్లను కట్టడి చేయాలని డిమాండ్ చేసింది.

14 లక్షల కోట్లు రైటాఫ్!

- బీజేపీ హయాంలో లక్షల కోట్ల కార్పొరేట్ లోన్లు మాఫీ
- పెద్దోళ్ల రుణాల వసూళ్లలో చేతులెత్తేస్తున్న బ్యాంకులు
- సామాన్యుడి నుంచైతే ముక్కుపిండి మరీ వసూలు
- మోదీ పాలనలో ఉద్దేశపూర్వక ఎగవేతలు 10 రెట్లు జంప్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



లలిత్ మోదీ, నీరవ్, విజయ్ మాల్యా

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ): గృహరుణమో, కారు రుణమో.. ఒక్కనెల ఈఎంఐ కట్టకుండా ఆపండి.. బ్యాంకు నుంచి వందలాది ఫోన్లు వస్తాయి. రెండో నెల కూడా ఈఎంఐ జమచేయకపోతే ఇంటికి ఏకంగా నోటీసులు, జప్తు చేస్తామంటూ బెదిరింపులు వస్తాయి. అవునా? సామాన్యుల విషయంలో ఈ రేంజులో విరుచుకుపడే బ్యాంకులు.. కార్పొరేట్ల విషయంలో మాత్రం సైలెంట్‌గా ఉంటున్నాయి. పేద, మధ్యతరగతి జీవులు పైసాపైసా కూడబెట్టి బ్యాంకుల్లో దాచుకొన్న సొమ్ము.. ఎగవేతదార్ల జేబుల్లోకి పోతున్నది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశీయ బ్యాంకింగ్ రంగంలో రుణాల రైటాఫ్‌లు కనీవినీ ఎరుగని రీతిలో పెరిగాయి. 2014 నుంచి 2023 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులు రూ.14,56,226 కోట్ల మొండి బకాయిలు రద్దు చేశాయి. ఇందులో కార్పొరేట్లకు సంబంధించి రూ. 7,40,968 కోట్లు ఉండటం గమనార్హం.

పది రెట్లు పెరిగారు

ఉద్దేశపూర్వక రుణ ఎగవేతలు (విల్‌ఫుల్ డిఫాల్టర్లు) బీజేపీ హయాంలో ఏకంగా పది రెట్లు పెరిగాయి. 2022 డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల సంఖ్య 16,044గా ఉన్నట్టు పలు బ్యాంకులు ఇచ్చిన నివేదికలను బట్టి తెలుస్తున్నది. మొత్తంగా వీళ్లు రూ. 3,46,479 కోట్ల రుణాలను కావాలనే ఎగ్గొట్టినట్టు సమాచారం. ఇందులో 85 శాతం రుణాలను ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచే తీసుకొన్నట్టు తెలుస్తున్నది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలను తీసుకొని విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ తదితరులు విల్‌ఫుల్ డిఫాల్టర్లేనని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా వేసిన ఓ పిటిషన్‌కు ప్రభుత్వమే బదులిచ్చింది. ఇచ్చిన రుణాలను తర్వాత వసూలు చేసుకుంటామంటూ ముందుగా రైటాఫ్‌లకు దిగుతున్న బ్యాంకులు.. ఆ తర్వాత రికవరీ చేస్తున్న మొత్తాలు అత్యంత తక్కువగా ఉంటున్నాయి. గడిచిన తొమ్మిదేండ్లలో రూ.14,56,226 కోట్ల మొండి బకాయిలను రైటాఫ్ చేసిన బ్యాంకులు.. వసూలు చేసింది మాత్రం రూ. 2,04,668 కోట్లే. అంటే రికవరీ రేటు కేవలం 14 శాతమే.

రైటాఫ్‌లు ఎంతంటే?

2014 కంటే ముందు ఉద్దేశపూర్వక ఎగవేతలు	2022 చివరినాటికి ఉద్దేశపూర్వక ఎగవేత రుణాలు
రూ. 25 వేల కోట్లు	రూ. 3.46 లక్షల కోట్లు



బీజేపీ తొమ్మిదేండ్ల హయాంలో విల్‌ఫుల్ డిఫాల్ట్స్ పెరుగుదల- 10 రెట్లు

బీజేపీ హయాంలో మొత్తం రైటాఫ్‌ల విలువ- రూ. 14.56 లక్షల కోట్లు

అంతులేని అకృత్యాలు!

- ప్రజ్వల్, రేవణ్ణల లైంగిక దాడులపై బాధితుల ఫిర్యాదులు
- ప్రజ్వల్ కుటుంబ పలుకుబడికి భయపడి ఇన్నాళ్లూ మౌనం
- తాజా కేసులతో రేవణ్ణ అరెస్టు.. ప్రజ్వల్‌పై మరో లుకౌట్ నోటీసు

బెంగళూరు: జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ, ఆయన తండ్రి రేవణ్ణలు చేసిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇంతకాలం భయంతోనో, అధైర్యంతోనో బయటకురాని బాధితులు ఇప్పుడు ధైర్యం చేసి బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తండ్రీ కొడుకులపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు కన్నడనాట పెను సంచలనంగా మారాయి.



రేవణ్ణ

మూడేండ్లుగా లైంగిక దాడి

మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబానికి కన్నడ నాట రాజకీయంగా, ఆర్థికంగా మంచి పలుకుబడి ఉంది. దేవెగౌడ మనవడైన ప్రజ్వల్ ప్రస్తుతం హసన్ ఎంపీగా ఉన్నారు. ఆయన నాన్న రేవణ్ణ ఎమ్మెల్యే. ఈ నేపథ్యంలో తమ కుటుంబంపై ఎవరూ ఫిర్యాదు చేయరనే ధైర్యంతో ప్రజ్వల్, ఆయన తండ్రి రేవణ్ణ కొందరు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కూడా ఇలాగే లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిపై కేసు నమోదు కాకుండా కోర్టుకు వెళ్లి ప్రజ్వల్ స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. కానీ ఈసారి మాత్రం వేలాది వీడియోలతో దొరికిపోయారు! ఇవన్నీ ఆయన ఫోనులో చిత్రీకరించినవి కావడం గమనార్హం. తనపై ప్రజ్వల్ మూడేండ్లుగా అనేకసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని, మొదటిసారి తుపాకీతో బెదిరించి లైంగిక దాడి చేశాడని.. దాన్ని వీడియో తీసి తనను బ్లాక్‌మెయిల్ చేశాడని జిల్లా పరిషత్ మాజీ సభ్యురాలు(44) ఒకరు పోలీసుల ఎదుట వాపోయారు. ఆ తర్వాత తనకు తరచూ ఫోన్ చేసి నగ్నంగా మాట్లాడాలని వేధించేవాడని ఆమె వాపోయారు. ప్రజ్వల్ ఇంట్లో పనిచేసిన వంట మనిషి కూడా ప్రజ్వల్ అకృత్యాలను మీడియాకు వెల్లడించింది. అతడు తరచూ తనను లైంగికంగా వేధించేవాడని... తన కూతురికి ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడని ఆవేదన వ్యక్తం చేసింది. తన దగ్గరకు వివిధ పనుల నిమిత్తం వచ్చే మహిళలను భయపెట్టో, బెదిరించో లేదా ఇంకేదైనా ఆశ చూపించో ప్రజ్వల్ ఈ నీచమైన పనులకు పాల్పడేవాడని ఆయన ఇంట్లో పనిచేసే వారే చెప్తున్నారు. ప్రజ్వల్ రోజుకు ముగ్గురు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడేవారని మాజీ ఎంపీ శివరామే గౌడ ఆరోపించారు. తన ఇంట్లో పని చేసిన మహిళను అపహరించిన కేసులో రేవణ్ణను సిట్ బృందం శనివారం అదుపులోకి తీసుకుంది. మరోవైపు పోలీసులు ప్రజ్వల్‌పై రెండోసారి లుక్ అవుట్ నోటీస్ జారీ చేశారు.

పాక్‌కు కాంగ్రెస్ ప్రేమ లేఖలు!

ప్రధాని మోదీ విమర్శలు

రాంచీ/దర్భంగా, మే 4: దేశంలో ఉగ్రవాద సమస్యపై గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉన్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. ఉగ్రవాదాన్ని అరికట్టే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పాకిస్థాన్ పట్ల బలహీనంగా వ్యవహరించాయని, ఓవైపు దేశంలో ఉగ్రదాడులు జరుగుతుంటే, కాంగ్రెస్ సర్కార్లు మాత్రం పాక్‌కు 'ప్రేమ లేఖలు' పంపాయని విమర్శించారు. శాంతి కోరుతూ పంపిన లేఖలకు.. సమాధానంగా పాక్ నుంచి మరింత మంది ఉగ్రవాదులు వచ్చారని అన్నారు. శనివారం జార్ఖండ్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం పట్ల తాము కఠినంగా ఉన్నామని అన్నారు.

లాలూ గోద్రా నిందితులను కాపాడే ప్రయత్నం చేశారు

బీహార్‌లో మోదీ మాట్లాడుతూ ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. గోద్రా రైలు దహనం ఘటన కేసులో నిందితులను కాపాడేందుకు లాలూ ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. రైల్వే మంత్రిగా లాలూ.. గోద్రా ఘటనపై విచారణ కమిటీ వేశారని, భయంకరమైన నేరానికి పాల్పడిన వారిని నిర్దోషులుగా ప్రకటించే నివేదికను రూపొందించారని అన్నారు.

'సందేశ్‌ఖాలీ' ఓ పెద్ద కుట్ర

- ఎన్నికల వేళ మమ్మల్ని దెబ్బతీయడానికి బీజేపీనే సృష్టించింది
- బీజేపీ నేత సంభాషణ విడుదల చేసిన తృణమూల్ కాంగ్రెస్
- గత ప్రభుత్వాలేవీ ఇంత క్రూర ఆలోచన చేయలేదు: మమత

కోల్‌కతా, మే 4: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సందేశ్‌ఖాలీ ఉదంతం ఒక పెద్ద కుట్ర అని టీఎంసీ ఆరోపించింది. కేవలం బెంగాల్‌పై ద్వేషం, అధికార కాంక్షతో బీజేపీ ఈ క్రూరమైన చర్యకు పాల్పడిందని విమర్శించింది. సందేశ్‌ఖాలీ కుట్రపై బీజేపీ నేత ఒకరు మాట్లాడిన వీడియోను ఆ పార్టీ శనివారం సోషల్ మీడియాలో విడుదల చేసింది. లోక్‌సభ ఎన్నికల వేళ టీఎంసీ ప్రతిష్ఠ దిగజార్చడానికి ఇది బీజేపీ పన్నిన కుట్రగా పేర్కొంది. సందేశ్‌ఖాలీలో స్థానిక టీఎంసీ నేతలు మహిళలను లైంగికంగా వేధించడమే కాక, వారి భూములను బలవంతంగా లాక్కున్నారంటూ వచ్చిన ఆరోపణలు మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని తీవ్ర ఇరకాటంలోకి నెట్టేసిన సంగతి తెలిసిందే. కాగా, శనివారం విడుదల చేసిన వీడియోలో సందేశ్‌ఖాలీ బీజేపీ మండల అధ్యక్షుడిగా పేర్కొంటున్న ఒక వ్యక్తి ఈ మొత్తం కుట్రకు బెంగాల్ అసెంబ్లీ విపక్ష బీజేపీ నేత సువేందు అధికారే ప్రధాన సూత్రధారి అని పేర్కొన్నారు. సందేశ్‌ఖాలీకి చెందిన టీఎంసీ నేత షాజహాన్ షేక్ సహా స్థానికంగా ఉన్న నేతలు లైంగిక దాడికి పాల్పడ్డారంటూ ముగ్గురు నలుగురు మహిళలు ఆరోపించేలా చేయమంటూ తనకు, మరికొంత మంది నేతలకు సువేందు అధికారి ఆదేశాలు ఇచ్చారన్నారు. అలాగే నందిగ్రామ్ శాసనసభ్యుడైన సువేందు అధికారి స్వయంగా సందేశ్‌ఖాలీలోని ఒక ఇంట్లో తుపాకులు ఉంచారని, వాటినే తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ దాడిలో స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు.



రాష్ట్రాన్ని దిగజార్చే ప్రయత్నం

సందేశ్‌ఖాలీపై వెల్లడైన నిజాలు షాకింగ్‌కు గురి చేశాయని, ఈ విషయంలో బీజేపీ ఎంత లోతుగా వ్యవహరించిందో బట్టబయలైందని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. శనివారం ఆమె పలు ఎన్నికల సభలలో మాట్లాడుతూ బెంగాల్ అభివృద్ధి, సంస్కృతిని చూసి ద్వేషం పెంచుకున్న ఈ బెంగాలీ విరోధులు రాష్ట్రాన్ని అన్ని విధాల దిగజార్చడానికి కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒక రాష్ట్రంలోని ప్రజలందరిపై గతంలో ఎన్నడూ ఏ కేంద్ర ప్రభుత్వమూ ఇలాంటి క్రూరమైన ఆలోచన చేయలేదన్నారు.

ఇది సిగ్గుమాలిన చర్య: అభిషేక్ బెనర్జీ

'సందేశ్‌ఖాలీ వెనుక జరిగిన కుట్ర స్టింగ్ వీడియోలో బయటపడింది. అది నిజంగా షాక్ కలిగించింది. అభివృద్ధి బాటలో ఉన్న బెంగాల్‌పై ద్వేషం, ఎన్నికల్లో లబ్ధి పొందడానికి వారు జరిపిన కుట్ర బయటపడింది. ఈ అసహ్యకరమైన చర్య చరిత్రలో అత్యంత ఘోరమైన అధికార దుర్వినియోగాన్ని సూచిస్తుంది' అని టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ పేర్కొన్నారు. ఇది బీజేపీ సిగ్గుమాలిన చర్య అని మండపడ్డారు. టీఎంసీ ఆరోపణలపై బీజేపీ అధికార ప్రతినిధి శంకుదేబ్ పాండే మాట్లాడుతూ సందేశ్‌ఖాలీ ఉదంతంతో ప్రజాగ్రహం పెల్లుబుకుతుండటంతో దాని నుంచి బయటపడటానికి మరో మార్గం లేక టీఎంసీ ఇలాంటి వీడియోలు సృష్టించిందన్నారు.

10 వేల మందిని వెంటేసుకొని నామినేషన్

బీజేపీ ఎంపీ బ్రిజ్ బలప్రదర్శన

న్యూఢిల్లీ, మే 4: తన కుమారుడి నామినేషన్ వేళ బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ అర్థ బలం, అంగ బలాన్ని ప్రదర్శించారు. రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయన అనుచరగణంతో బల ప్రదర్శనకు దిగారు. కరణ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన సభకు 10 వేల మంది హాజరయ్యారు. వీరిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీచైర్మన్‌లు, బీజేపీ స్థానిక నేతలు ఉన్నారు. అలాగే 500 నుంచి 700 వరకు ఎస్‌యూవీలు వచ్చినట్టు వార్తా కథనాలు వచ్చాయి. సభా వేదికపై అంతా కుర్చీల్లో కూర్చోగా...బ్రిజ్ భూషణ్ మాత్రం ఒక రాజు మాదిరి మధ్యలో సోఫాలో కూర్చోవటం చర్చనీయాంశమైంది.

మోతీలాల్ అంబానీలా ధనవంతుడు

కంగన వివాదాస్పద వ్యాఖ్యలు

సిమ్లా, మే 4: సినీ నటి, మండీ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ మాజీ ప్రధాని నెహ్రూ తండ్రి మోతీలాల్ నెహ్రూపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మోతీలాల్ నెహ్రూ అప్పట్లో అంబానీలా అత్యంత ధనవంతుడని, బ్రిటీషర్లతో అత్యంత సన్నిహితంగా మెలిగే ఆయనకు అంత సంపద ఎలా వచ్చిందో ఎవరికీ తెలియదని శనివారం ఎన్నికల ప్రచార సభలో ఆరోపించారు. కంగన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ పార్టీ సీనియర్ నేతపై అవమానకర వ్యాఖ్యలు చేసిన ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ ఈసీకి ఫిర్యాదు చేసింది. స్వాతంత్ర్య సమరయోధుడైన మోతీలాల్ నెహ్రూను వ్యాపారవేత్తతో పోల్చి ఆయనను అవమానపరిచారని పేర్కొంది.

'రోహిత్ కేసుతో రాహుల్ రాజకీయం'

న్యూఢిల్లీ: తెలంగాణకు చెందిన రోహిత్ వేముల కేసును కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రాజకీయం చేశారని బీజేపీ మండిపడింది. ఈమేరకు బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ ట్వీట్ చేశారు. ఈ కేసులో తెలంగాణ పోలీసులు క్లోజర్ రిపోర్టును కోర్టుకు సమర్పించిన నేపథ్యంలో దళితులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెబుతారా? అని ప్రశ్నించారు. రోహిత్ మరణాన్ని రాహుల్ తన వికృత రాజకీయాల కోసం వినియోగించుకున్నారని దుయ్యబట్టారు. రోహిత్ ఎస్సీ వర్గానికి చెందినవారు కాదని, ఆయన ఆత్మహత్య చేసుకున్నారని కాంగ్రెస్ పాలిత ప్రభుత్వమే క్లోజర్ రిపోర్టును దాఖలు చేసిందన్నారు.

బ్రెజిల్‌లో వరదలు.. 57 మంది మృతి

సావో పాలో: బ్రెజిల్‌లోని రియో గ్రాండే డూ సుల్ రాష్ట్రంలో భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. స్థానిక అధికారుల కథనం ప్రకారం.. వరదల ధాటికి శనివారం మధ్యాహ్నానికి దాదాపు 57 మంది మరణించారు. అనేక మంది ప్రజల ఆచూకీ తెలియడం లేదు. సివిల్ డిఫెన్స్ అథారిటీ తెలిపిన వివరాల ప్రకారం 67 మంది అదృశ్యమైనట్లు తెలుస్తున్నది. ఈ రాష్ట్రంలోని 497 సిటీల్లో మూడింట రెండొంతుల నగరాలు వర్షాలకు ప్రభావితమవడంతో సుమారు 32,000 మంది నిరాశ్రయులయ్యారు. అనేక రోడ్లు, వంతెనలు ధ్వంసమవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నిజ్జర్ హత్య కేసు.. నిందితులకు పాక్‌తో సంబంధాలు!

న్యూఢిల్లీ: ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో కెనడా పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులకు పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఇంగ్లిష్ మీడియా కథనాలు వెల్లడించాయి. 'కెనడాలో భారత్‌కు వ్యతిరేకంగా, ఖలిస్థానీ అనుకూల కార్యకలాపాలు సాగించే వాళ్లకు పాక్ ఐఎస్ఐ నుంచి నిధులు అందుతున్నాయి. తాజా కేసులో అరెస్టు అయిన ముగ్గురు డ్రగ్స్ దందా చేస్తున్నారని, వారికి ఐఎస్ఐతో సంబంధాలున్నాయని మాకు తెలిసింది' అని సదరు వర్గాలు తెలిపాయి.



ఎన్నికల బరిలో థర్డ్ జెండర్

న్యూఢిల్లీ, మే 4: దక్షిణ ఢిల్లీ స్థానం నుంచి రజన్ సింగ్(26) అనే థర్డ్ జెండర్ వ్యక్తి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ధోతి, టోపి ధరించిన రజన్ శుక్రవారం ఒంటరిగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. బీహార్‌కు చెందిన రజన్ సింగ్ ఢిల్లీలో స్థిరపడ్డారు. థర్డ్ జెండర్ వ్యక్తుల సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావడానికే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు రజన్ తెలిపారు. దేశంలో పశువుల సంరక్షణకు కూడా సంక్షేమ బోర్డులు ఉన్నాయి కానీ థర్డ్ జెండర్ వ్యక్తుల కోసం పని చేసే వ్యవస్థ లేదని వాపోయారు. కేవలం పత్రాల్లో మాత్రమే వారికి గుర్తింపు ఉందన్నారు.



ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, మే 4: ఉల్లి ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే, కనీస ఎగుమతి ధర టన్నుకు 550 డాలర్లుగా నిర్ణయించింది. ఉల్లి పంట దిగుబడి తగ్గుతుందని, ధరలు పెరుగుతాయనే అంచనాల నేపథ్యంలో గత డిసెంబరులో కేంద్రం విదేశాలకు ఉల్లి ఎగుమతులను నిలిపివేసింది. మన దేశం నుంచి గత 4 – 5 ఏండ్లుగా ఏటా 17 లక్షల నుంచి 25 లక్షల టన్నుల ఉల్లి విదేశాలకు ఎగుమతి అవుతున్నది. ప్రస్తుతం ఉల్లి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసింది. ఉల్లి ఎక్కువగా పండించే మహారాష్ట్రలో ఈ నిర్ణయం ఎన్నికల్లో ప్రభావితం చేస్తుందనే అంచనాలు ఉన్నాయి.



గవర్నర్ కేసులో నలుగురికి సమన్లు

కోల్‌కతా : బెంగాల్‌లోని రాజ్‌భవన్ ఉద్యోగినిపై గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న కేసులో కోల్‌కతా పోలీసుల నేతృత్వంలో ఏర్పాటైన స్పెషల్ ఎంక్వైరీ టీమ్ (ఎస్ఈటీ) శనివారం నలుగురు రాజ్‌భవన్ ఉద్యోగులకు సమన్లు పంపింది. డీసీ ఇందిరా ముఖర్జీ నేతృత్వంలో ఏర్పాటైన ఈ బృందం శుక్రవారమే దర్యాప్తు ప్రారంభించింది. సీసీటీవీ ఫుటేజ్‌లు సమర్పించాలని రాజ్‌భవన్ వర్గాలకు ఆదేశాలు జారీచేసింది. కాగా, ఆరోపణలు వచ్చినప్పటికీ గవర్నర్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టలేరని ఒక అధికారి తెలిపారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆయన చెప్పారు.



బంగారం స్మగ్లర్‌గా మారిన ఆఫ్ఘన్ దౌత్యవేత్త!

ముంబయి : సుమారుగా 25 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ ముంబై విమానాశ్రయ అధికారులకు దొరికిపోయిన ఆఫ్ఘనిస్థాన్ కాన్సుల్ జనరల్ జాకియా వార్దక్ తన పదవికి రాజీనామా చేశారు. విమానాశ్రయ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 25న జాకియా వార్దాక్ (58) తన కుమారుడితో కలిసి దుబాయ్ నుంచి ముంబయి చేరుకున్నారు. తనిఖీల్లో జాకియా నడుముకు ఉన్న జాకెట్, బెల్ట్, మోకాలు వద్ద రహస్యంగా బంగారు కడ్డీలు దాచుకొని, అక్రమంగా తరలిస్తున్నట్టు తేలింది. దీంతో ఆమెపై బంగారం అక్రమ రవాణా, కస్టమ్స్ చట్టం కింద కేసు నమోదైంది.

ఎన్నికల వేళ కశ్మీర్‌లో ఉగ్ర దాడి

సైనికుడి మృతి.. నలుగురు జవాన్లకు గాయాలు



అనంత్‌నాగ్: జమ్ము-కశ్మీర్‌లో లోక్‌సభ ఎన్నికల తరుణంలో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. అనంత్‌నాగ్-రాజౌరీ నియోజకవర్గంలో ఈ నెల 25న పోలింగ్ జరగనున్న సమయంలో.. ఈ నియోజకవర్గం పరిధిలోని పూంఛ్ జిల్లాలో కాల్పులకు తెగబడ్డారు. భారత వాయు సేన (ఐఏఎఫ్) గస్తీ బృందం ప్రయాణిస్తున్న వాహన శ్రేణిపై కాల్పులు జరిపారు. ఐఏఎఫ్ చేసిన ట్వీట్‌లో తెలిపిన వివరాల ప్రకారం, సురాన్‌కోట్ ప్రాంతంలోని సనాయ్ టాప్ వైపు వెళ్తున్న ఈ సైనికులపైకి శనివారం సాయంత్రం 6.15 గంటలకు నలుగురు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో ఐదుగురు సైనికులు గాయపడ్డారు. వీరిలో ఒకరు మిలిటరీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.

సైనిక వాహనానికి ప్రమాదం.. అధికారి దుర్మరణం

దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో శనివారం ఓ సైనిక వాహనం ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో సైనికాధికారి గురుప్రీత్ సింగ్ ప్రాణాలు కోల్పోగా, మరి కొందరు సైనికులు గాయపడ్డారు. సైనిక గస్తీ బృందం ప్రయాణిస్తున్న ఈ వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

ఎన్నికల గండం.. పదవుల 'గ్యారెంటీ'!

- జీవన్‌రెడ్డికి కేంద్ర వ్యవసాయ మంత్రి అట
- కోమటిరెడ్డి బ్రదర్స్ మంత్రులట
- వాకిటి, అద్దంకికీ హామీ
- ఎన్నికలైపోతే.. 'ఏరు దాటాక' చందమేనా?
- కాంగ్రెస్ నేతల్లోనే అనుమానాలు

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ) : 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లానే ఇప్పుడు పదవులు గ్యారెంటీ అని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఎరవేస్తున్నారా? లోక్‌సభ ఎన్నికల గండం నుంచి గట్టెక్కేందుకే కేంద్ర, రాష్ట్ర మంత్రులు, నామినేటెడ్ పోస్టుల ఆశపెట్టి మొండి 'చెయ్యి' చూపుతారా?' అని కాంగ్రెస్ నేతల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎక్కడికెళ్లినా అక్కడి నేతకు రేవంత్‌రెడ్డి పదవుల ఎర వేస్తున్నారు. పోస్టులు వస్తాయన్న ఆశతోనైనా గెలుపు కోసం కృషి చేస్తారన్న ఆలోచనతోనే రేవంత్ ఇలాంటి హామీలు గుప్పిస్తున్నాడు తప్ప 'ఏరు దాటాక బోడి మల్లన్న' అంటాడేమోనని ఆ పార్టీ నేతలే వాపోతున్నారు. నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి రేవంత్‌రెడ్డి వెళ్లిన సందర్భంలో అక్కడ అభ్యర్థి టీ జీవన్‌రెడ్డిని గెలిపిస్తే కేంద్రంలో వ్యవసాయ శాఖ మంత్రి అవుతాడని ప్రకటించిన విషయం తెలిసిందే. ఒకవేళ కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకొస్తే కేంద్ర మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలనేది అధిష్ఠానమే నిర్ణయిస్తుంది తప్ప ముఖ్యమంత్రులు కాదన్నది కాంగ్రెస్ నాయకులకు తెలియంది కాదు. మరి జీవన్‌రెడ్డికి కేంద్ర మంత్రి పదవి అని ఏ ధీమాతో హామీ ఇచ్చారో రేవంత్‌కే తెలియాలి. ఇక రాష్ట్ర మంత్రివర్గంలో ఇప్పటికీ ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఒకవేళ పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రివర్గ విస్తరణ జరిగే పక్షంలో



ఇప్పటిదాకా ప్రాతినిధ్యం లభించని జిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానం ఉంటుంది తప్ప ఇప్పటికే ప్రాతినిధ్యం ఉన్న జిల్లాలకు కాదన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మహబూబ్‌నగర్ నుంచి ఇప్పటికే ఇద్దరు..

తన సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత ప్రతిష్ఠాత్మకం. ఇక్కడ మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో పార్టీ అభ్యర్థులు గెలువని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి సీటుకు ఎసరు పెట్టేందుకు మంత్రివర్గ సహచరులు ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని పసిగట్టిన రేవంత్‌రెడ్డి, ఇప్పటికే బాహాటంగానే తనను రాజకీయంగా బలహీన పర్చేందుకు సొంత జిల్లాలోనే పార్టీ అభ్యర్థులు గెలువకుండా కుట్ర పన్నుతున్నారని పలుమార్లు ఆరోపించారు. ఎలాగైనా మహబూబ్‌నగర్ ఎంపీ సీటు గెలవాలని భావిస్తున్న రేవంత్‌రెడ్డి, ఎన్నికల ప్రచార సభలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని మంత్రివర్గంలోకి తీసుకుంటామని ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఇప్పటికే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిలో ఉండటంతోపాటు కొల్లాపూర్ ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్నారు. ఇక ఈ జిల్లా నుంచి మూడో వ్యక్తికి మంత్రి పదవి ఇస్తే, ప్రాతినిధ్యం లభించని జిల్లాల ఎమ్మెల్యేలు ఊరుకుంటారా? ఇందుకు పార్టీ అధిష్ఠానం అంగీకరిస్తుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

'బ్రదర్స్' ఇద్దరూ మంత్రులట..

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రేవంత్‌రెడ్డి తనకు అత్యంత సన్నిహితుడైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి టికెట్ ఇప్పించుకున్నారు. ఇక్కడ పార్టీ అభ్యర్థి గెలువాలంటే మొన్నటిదాకా సిట్టింగ్ ఎంపీగా ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మనస్ఫూర్తిగా కృషి చేయాలి. పైగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా సీఎం పదవి ఆశించి భంగపడిన నాయకుడే. ఈ నేపథ్యంలో భువనగిరి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సందర్భంలో 'నాతో పాటు సీఎం అయ్యే అర్హత పార్టీలో ఎవరికైనా ఉంది అంటే అది కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే' అంటూ రేవంత్‌రెడ్డి ఆయనను మునగ చెట్టు ఎక్కించే ప్రయత్నం చేశారు. భువనగిరిలో తన మిత్రున్ని గెలిపించుకునేందుకే రేవంత్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేసి ఉంటారని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భువనగిరి నుంచి ఎంపీగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడు రాజగోపాల్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆయన మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్నారు. భువనగిరి ఎంపీ టికెట్ తన భార్య లక్ష్మి కోసం రాజగోపాల్‌రెడ్డి చివరిదాకా ప్రయత్నించి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయానికి రాజగోపాల్‌రెడ్డి కృషి చేస్తారో? లేదోనన్న అనుమానంతో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బాధ్యతను ఆయనకే అప్పగించి ఉంటారని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఇక్కడి నుంచి పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తనకు హామీ ఇచ్చినట్టు రాజగోపాల్‌రెడ్డి బాహాటంగానే చెప్పుకొంటున్నారు. సీఎం ప్రస్తుతానికి తన వద్ద ఉంచుకున్న హోంశాఖ తనదేనంటూ ఎన్నికల ప్రచార వేదికలపైనే రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఇప్పటికే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కొన్ని జిల్లాలకు మంత్రివర్గంలో చోటే లభించని నేపథ్యంలో నల్లగొండ జిల్లాకు మూడో మంత్రి పదవి ఇవ్వడం ఎలా సాధ్యం?, ఒకే కుటుంబంలో అన్నదమ్ములిద్దరికీ మంత్రి పదవులిస్తే, ఇతర సీనియర్ నాయకులు ఊరుకుంటారా? అధిష్ఠానం అందుకు సమ్మతిస్తుందా? అన్న ప్రశ్నలు వస్తున్నాయి.

అద్దంకి దయాకర్‌కు మంచి పదవట!

ఓవైపు ఎంపీ అభ్యర్థులకు కేంద్ర మంత్రి పదవులు, ఎమ్మెల్యేలకు రాష్ట్ర మంత్రి పదవుల ఎర వేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, తాజాగా సిద్దిపేట ఎన్నికల ప్రచార వేదికపై మరో సీనియర్ నాయకుడు అద్దంకి దయాకర్‌కు మంచి పదవి ఇస్తానని ప్రకటించారు. పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందు రోజు నామినేటెడ్ పదవులు ఇస్తున్నట్లు మీడియాకు అనధికార ప్రకటన విడుదల చేశారు కానీ, అధికారికంగా ఎవరికీ నియామక ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్న పార్టీ నేతలు, ఎంపీ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి వేస్తున్న పదవుల ఎరను నమ్మడం లేదని పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తున్నది. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక రేవంత్‌రెడ్డి ప్రాధాన్యాలు మారిపోతాయని, దీంతో తమ పరిస్థితి 'ఏరు దాటాక బోడి మల్లన్న' చందమే అవుతుందేమోనన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- నీళ్లు లేక ఎండిన పంటలు..
- అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపం
- పురుగుమందు తాగి బలవన్మరణం
- హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో విషాదం

ఐనవోలు/రామడుగు (చొప్పదండి), మే 4: నీళ్లు లేక ఎండిన పంటలు.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక మరో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనలు హనుమకొండ, కరీంనగర్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని శివారు లక్ష్మీపురానికి చెందిన రైతు తక్కళ్లపల్లి మురళీధర్‌రావు (46)కు ఎకరం 20 గుంటల భూమి, బావి ఉన్నాయి. వ్యవసాయంతోపాటు గ్రానైట్ కంపెనీలో పని చేసేవాడు. పెట్టుబడుల కోసం అప్పు చేసి కొంత భూమిలో పత్తి, మరికొంత వరి వేశాడు. బావిలో నీళ్లు అడుగంటి, పంటలకు సాగునీరందకపోవడంతో మొత్తం ఎండిపోయి పెట్టుబడి మట్టిపాలైంది. వ్యవసాయం, ఇద్దరు పిల్లల చదువుల కోసం చేసిన రూ.6 లక్షల అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్సకోసం వరంగల్ ఎంజీఎం



మురళీధర్‌రావు (ఫైల్)

దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం చనిపోయాడు. అతనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కూడా అందలేదని కుటుంబసభ్యులు తెలిపారు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉండగా, భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేశరాజుపల్లిలో కంకణాల రవి..

కరీంనగర్ జిల్లా దేశరాజుపల్లికి చెందిన కంకణాల రమేశ్ అలియాస్ రవి (40) గ్రామంలోని ఓ రైతు వద్ద రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం బంధువుల వద్ద అప్పు చేశాడు. నీరందక పంట సరిగా పండలేదు. దీంతో అప్పులు పెరిగిపోవడం, వాటిని తీర్చే దారి తెలియక శుక్రవారం గ్రామ శివారులోని మహంకాళి బావిగడ్డపై పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్ దవాఖానకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. శనివారం పరిస్థితి విషమించి మరణించాడు. భార్య సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మావోయిస్టు ప్రాంతాలపై ఫోకస్

- అవసరమైతే అదనపు బలగాలు
- సరిహద్దుల్లో తనిఖీలు
- లా అండ్ ఆర్డర్ ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్

హైదరాబాద్, మే 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు లా అండ్ ఆర్డర్ ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ శనివారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నిఘా మరింత పెంచామని, ప్రస్తుతం తెలంగాణలో ఎన్నికల కోసం 160 కేంద్ర బలగాలను రంగంలోకి దించుతున్నామని వెల్లడించారు. అవసరమనుకుంటే అదనపు బలగాలు కూడా ఉపయోగించుకునే అవకాశం ఉందని సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావం తక్కువగా ఉన్నా.. ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల్లో కేంద్ర, రాష్ట్ర బలగాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు, ఎస్పీలు పోలింగ్‌స్టేషన్లను తనిఖీ చేస్తున్నారని చెప్పారు. ఎప్పటికప్పుడు డ్రోన్లతో నిఘా పెట్టి, పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్నారని తెలిపారు. సీఏఎస్ఎఫ్ బలగాలతో



సంజయ్‌కుమార్

ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తూ ప్రజలకు భద్రత కల్పిస్తున్నట్టు తెలిపారు. సరిహద్దులో మావోయిస్టు ప్రభావం ఉన్న ఒక్కో జిల్లాకు సుమారు 250 మంది చొప్పున కేంద్ర బలగాలను రంగంలోకి దించామని తెలిపారు. అత్యవసరమైతే అటవీశాఖ సిబ్బందిని కూడా ఉపయోగించుకునే అవకాశం ఉందని సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటుకు వారి కుటుంబసభ్యులతో మాట్లాడటం, కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నట్టు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల కుటుంబాలకు వారి తలపై ఉన్న రివార్డును తక్షణమే అందించి, వారిపై ఉన్న కేసులు మాఫీ చేస్తామని చెప్పారు.

కాంగ్రెస్ నాయకుడి హత్య

బండ్లగూడ,మే 4: హైదరాబాద్ నగర పరిధిలోని రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ నాయకుడు హత్యకు గురయ్యాడు. పాతకక్షల నేపథ్యంలో ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌కు చెందిన మక్బూల్ శనివారం రాత్రి స్థానిక ఇంద్రానగర్ బస్టాప్ వద్ద చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి వస్తున్నారనే సమాచారంతో వేచి ఉన్నారు. ఇదే సమయంలో అదే ప్రాంతానికి చెందిన అంజాద్ అనే వ్యక్తి అతడిపై ఒక్కసారిగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన మక్బూల్‌ను పోలీసులు హుటాహుటిన సమీపంలోని ఓ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

కొవిషీల్డ్ దుష్ప్రభావాలకు చెక్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 4 (నమస్తే తెలంగాణ): కొవిషీల్డ్ దుష్ప్రభావాలకు వందేండ్ల పురాతన 'మేజర్ ఆటో హెమో థెరపీ' ప్రత్యామ్నాయ చికిత్స అని పల్మనాలజిస్ట్, అలెర్జిస్ట్ వ్యాకరణం నాగేశ్వర్ పేర్కొన్నారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖకు మెయిల్ చేసినట్టు వెల్లడించారు. రక్తం గడ్డ కట్టే మెకానిజంపై సమర్థవంతంగా పనిచేసే ఈ థెరపీ తీరును ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు.

పాపం.. పసిపాప

- మాతృత్వం మరిచి రోడ్డు పక్కన వదిలేసిన మహిళ
- దవాఖానకు తరలించిన స్థానికులు, పోలీసులు
- హనుమకొండ జిల్లా ఊరుగొండ వద్ద ఘటన



దామెర, మే 4: పాపం పసిపాప.. ఆడజన్మగా పురుడుపోసుకోవడమే ఆ పసికందు చేసుకున్న నేరం. మాతృప్రేమతో కన్న తల్లి ముర్రుపాలు తాగి వెచ్చని పొత్తిళ్లలో హాయిగా నిదురోవాల్సిన ఆ శిశువు.. పురిట్లోనే పేగుబంధానికి దూరమైంది. నెత్తుటి మరకలు కూడా శుభ్రం చేయని స్థితిలో.. బొడ్డుపేగునూ కోయకుండా ఉన్న ఆ పసిప్రాణి.. ఎర్రటెండలో రోడ్డు పక్కన మట్టికుప్పలో.. కొన ఊపిరితో కదలాడుతూ మానవత్వం ఉన్న మనుషుల కంటపడింది. అంతే.. ఆ శిశువును వారు అక్కున చేర్చుకున్నారు. గంటల వ్యవధిలో దవాఖానకు తరలించి పసిప్రాణాన్ని కాపాడారు. వైద్యుల పర్యవేక్షణలో ఆ ఆడబిడ్డకు నూరేళ్ల ఆయుష్షు పోశారు. ఈ హృదయ విదారక ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ పెద్దచెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. వరంగల్-భూపాలపట్నం జాతీయ రహదారిపై కల్వర్టుల నిర్మాణ పనులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఊరుగొండ పెద్ద చెరువు పక్కనే ఉన్న కేఎస్ఆర్ స్కూల్ ఎదురుగా రోడ్డు పక్కన డ్రైవర్ ట్రాక్టర్ వాటర్ ట్యాంకర్‌ను ఆపాడు. ఆ రోడ్డు పక్కన కదులుతున్న నవజాత శిశువును గమనించాడు. వెంటనే శిశువు ఉన్న ప్రదేశానికి చేరుకున్నాడు. మట్టిలో బొడ్డు పేగు కూడా ఊడకుండా ఉన్న ఆడశిశువుపై కొద్దిగా మట్టి చల్లి ఉంది. మట్టిలో ఉన్న శిశువును చేతుల్లోకి తీసుకుని కొద్దిదూరంలోనే ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కేకలు వేస్తూ విషయం చెప్పాడు. వెంటనే స్థానికులు, కూలీలు ఎస్సై అశోక్‌కు సమాచారం అందించగా.. ఆయన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. శిశువును టవల్‌తో శుభ్రం చేసి పోలీసు వాహనంలోనే ఆరెపల్లిలోని ఎన్ఎస్ఆర్ అపోలో దవాఖానకు తరలించారు. వైద్యులు శిశువును శుభ్రం చేసి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశం మేరకు శిశువును 108లో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం బాగుందని ఎంజీఎం వైద్యులు తెలిపారు. ఆడశిశువును వదిలేసిన ప్రాంతంలో పింక్ పంజాబీ ప్యాంట్‌ను గుర్తించామని, ఆధారాల కోసం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ కేసును దర్యాప్తు చేస్తున్నామని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై అశోక్ తెలిపారు.